యత్నాళ్‌పై కేసు



బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : ఆపరేషన్ కమల కోసం భాజపా నాయకులు రూ.1000 కోట్లను సేకరించారు. ఆ సొమ్ముతో ఎమ్మెల్యేలను కొనుగోలు చేయకుండా, ప్రజా సంక్షేమ కార్యక్రమాలను నిర్వహిస్తే బాగుండేది' అని వ్యాఖ్యలు చేసిన భాజపా ఎమ్మెల్యే బసనగౌడ పాటిల్ యత్నాళ్‌పై హైగ్రౌండ్స్ ఠాణాలో కేసు నమోదైంది. మాజీ ఎంపీ వీఎస్ ఉగ్రప్ప ఈ కేసు దాఖలు చేశారు. యత్నాళ్‌ను అదుపులోనికి తీసుకుని విచారణ చేస్తే ఆ నగదు ఎవరి దగ్గర ఉందో తెలుస్తుందని, ఈడీ అధికారులు కూడా విచారణ చేయాలని కోరతానని ఉగ్రప్ప చెప్పారు. యత్నాళ్ మాటలపై విచారణ అవసరమని భావిస్తున్నామని హోం మంత్రి పరమేశ్వర్ వ్యాఖ్యానించారు.

కుటుంబం.. విషాద పయనం

● ప్రమాదంలో నలుగురి మృతి

ఉడుపి, న్యూస్‌టుడే : కార్కళ నుంచి కుక్కే సుబ్రహ్మణ్య వెళ్తే దారిలోని హాస్సాన పాణగుడ్డె సమీపాన సోమవారం మధ్యాహ్నం సంభవించిన రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు దుర్మరణం చెందారు. మృతులను సురేశ్ ఆచార్య (36), ఆయన కుమార్తెలు సమీక్ష (7), సుశ్మిత (5), కుమారుడు శుశాంత్ (2)లను మృతులుగా గుర్తించారు. సురేశ్ భార్య మీనాక్షి ఆచార్య (32) తీవ్రంగా గాయపడ్డారు. ఆమెను చికిత్స కోసం స్థానిక ఆసుపత్రిలో చేర్పించారు. తమ ముగ్గురు పిల్లలతో కలిసి ఒకే బైకుపై వెళుతున్నప్పుడు ఎదురుగా వచ్చిన మినీ లారీ ఢీకొనడంతో ప్రమాదం సంభవించింది.

మైసూరు వైద్యురాలి అనుమానాస్పద మృతి

మైసూరు, న్యూస్‌టుడే : రాచనగరి మైసూరు లక్ష్మీపురంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో ఉంటున్న ప్రముఖ వైద్యురాలు డాక్టర్ విద్యాదిని (42) అనుమానాస్పదరీతిలో మరణించారు. స్థానిక ప్రభుత్వ చెలువాంబ ఆసుపత్రిలో ముఖ్య వైద్యాధికారిగా సేవలందిస్తున్నారు. ఆమె భర్త డాక్టర్ షణ్ముఖ కేఆర్ ఆసుపత్రిలో ప్రధాన వైద్యాధికారిగా పని చేస్తున్నారు. వీరు తమ ముగ్గురు పిల్లలతో కలిసి అపార్ట్‌మెంట్‌లో ఉంటున్నారు. ఆమె తన గది నుంచి బయటకు రాకపోవడంతో అనుమానంతో షణ్ముఖ చూసేసరికే మృతి చెంది ఉన్నట్లు సమాచారం. ఆమె మరణంపై తమకు అనుమానం ఉందని డాక్టర్ విద్యాదిని సోదరుడు శ్రీకాంత్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. లక్ష్మీపురం ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

గంగావళిలో ఎముకల కలకలం

కార్వార, న్యూస్‌టుడే : శిరూరు సమీప కొండచరియలు విరిగి పడిన ఘటనలో మరణించిన వారి కోసం గంగావళి నదిలో సోమవారం గాలింపు కొనసాగించారు. లారీ డ్రైవరు అర్జున్‌తో సహా మొత్తం తొమ్మిది మంది మృతదేహాలు ఇప్పటికే లభించాయి. నదిలో శోధిస్తున్న సమయంలో రెండు చోట్ల ఎముకలు లభించాయి. వాటిని డీఎన్ఏ పరీక్షకు పంపించాలని ఆదేశించామని జిల్లాధికారి లక్ష్మీప్రియ తెలిపారు. శిరూరుకు చెందిన జగన్నాథ్, లోకేశ్‌లకు చెందిన ఎముకలని స్థానికులు భావిస్తున్నారు.

కేసులకు తగ్గేదేలే..



మైసూరు, న్యూస్‌టుడే : తనను కట్టడి చేసేందుకు దుష్ట రాజకీయ నాయకులు ఇప్పటి వరకు 28 కేసులు వేశారని సామాజిక కార్యకర్త స్నేహమయి కృష్ణ తెలిపారు. ఇప్పటికే ఏడింటి కేసులు తప్పుడువని, మరో తొమ్మిది కేసుల్లో నిరపరాధిని తీర్పు వచ్చిందని గుర్తు చేశారు. ఆయన సోమవారం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ ఒక మహిళపై దాడి చేసి, వేధించానని జరుగుతున్న కేసు ఒక్కటే పెద్దది చెప్పారు. నంజనగూడు కోడలిలో తనపై దాడి చేశానని ఆ మహిళ ఫిర్యాదు చేయగా, పోలీసులు తన కాల్ రిజిస్ట్రరును పరిశీలించి ఆ సమయంలో మైసూరులో ఉన్నట్లు ఖరారు చేశారని తెలిపారు. ఆ కేసు విచారణ తనపై పూర్తయితే, మిగిలిన వాటిలోనూ నిర్దోషిగా బయటపడతానని ధీమా వ్యక్తం చేశారు.

బెళగావి వేడుకల వేళ గాంధీబాట!

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : మహాత్మాగాంధీ నేతృత్వంలో బెళగావిలో స్వాతంత్య్ర సమరానికి సంబంధించి కాంగ్రెస్ ప్లీనరీ నిర్వహించి వందేళ్లైన నేపథ్యంలో అక్టోబరు రెండో తేదీ నుంచి ఏడాది పాటు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తామని పీసీసీ అధ్యక్షుడు, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ ప్రకటించారు. బెంగళూరులోని కాంగ్రెస్‌భవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. అక్టోబరు 2న ఉదయం గాంధీభవన్ నుంచి విధానసౌధ సమీప బాపూజీ విగ్రహం వరకు 'గాంధీ నడక' కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛత కార్యక్రమాలకు శ్రీకారం చుడతామని వెల్లడించారు. ఈ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య పాల్గొంటారని వివరించారు. విధానసౌధ బ్యాంక్వెట్ హాల్‌లో ప్రతిజ్ఞ స్వీకార కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. బెంగళూరులోని వందలాది పాఠశాలల విద్యార్థులు జూమ్ ద్వారా ప్రతిజ్ఞ స్వీకారం చేస్తారని తెలిపారు. 'గాంధీ నడక' సందర్భంగా అందరూ ఖద్దరు టోపీలు ధరించాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ముఖ్యమంత్రి వీరప్పమొయిలీ, మంత్రి హెచ్.కె. పాటిల్, మాజీ మంత్రులు ఆర్.వి.దేశ్‌పాండే, అల్లం వీరభద్రప్ప, ఎమ్మెల్సీ బీకే హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీకే

రాజకీయ చక్రబంధం

● కేసుల వలలో సిద్ధు విలవిల

ఈనాడు, బెంగళూరు : ముఖ్యమంత్రి సిద్ధరామయ్య రాజకీయ చరమాంకం దినదినగండంలా మారుతోంది. రెండోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన నాటి నుంచి ఆయనకు పార్టీ లోపల- బయటా పోరు మొదలైంది. పేరుకు ఐదు గ్యారంటీలతో రాష్ట్రానికి సంక్షేమ ఫలాలు అందించారన్న మాటేగానీ- ఏనాడూ అధికారంలో కుదురుగా కూర్చున్నది లేదు. ముఖ్యమంత్రిగా పీఠమెక్కిన రోజే ఆయనకు ఉపముఖ్యమంత్రి నుంచి పోటీ మొదలైంది. రెండున్నరేళ్ల తర్వాత అనివార్యంగా అధికార పంపిణీ ఉంటుందని పార్టీ వర్గాల్లో చర్చ కొనసాగుతున్నా ఆ సమయం వచ్చే దాకా ముఖ్యమంత్రి స్థానం పదిలం అన్న భరోసా లేకుండా పోయింది. తాను బలహీన వర్గాల నాయకుడినని, అహింద ప్రజల కోసం నేను చేసే సేవలు ఓర్వలేక విపక్షాలు నాపై కక్ష గట్టాయని పదేపదే ఆరోపించే సిద్ధరామయ్య ఇటీవల ఆ వ్యాఖ్యను కాస్త సవరించారు. తనకు సొంత పార్టీలోనే శత్రువులున్నారని వ్యాఖ్యానించిన సిద్ధరామయ్య కలకలం సృష్టించారు. సంగొళ్లి రాయణ్ణ మాదిరి తనకు కూడా సొంతవారి నుంచి ప్రమాదం పొంచి ఉందని ఓ బహిరంగ సమావేశంలో అన్నారు. తాను ఎవరికీ భయపడనని ధీమా వ్యక్తం చేశారు. రాజకీయంగా ఎంత పోటీ ఉన్నా తట్టుకునే సిద్ధరామయ్యకు నేడు అంటిన అవినీతి మరక మాత్రం గట్టి దెబ్బ కొట్టనుంది.



క్లిష్ట పరిస్థితిలో సిద్ధరామయ్య

ఈడీతో ఢీకొట్టగలరా?

ప్రజా ప్రతినిధుల కోర్టు ముఖ్యమంత్రిని విచారించేందుకు అవకాశం కల్పించినా పోలీసులు మాత్రం కేసు నమోదు చేయలేదు. తన సొంత జిల్లా మైసూరులో లోకాయుక్త కార్యాలయం నుంచి కనీసం మూడు రోజుల తర్వాత కేసు నమోదు కాకపోవటంతో ఫిర్యాదుదారులు, విపక్ష నేతల నుంచి ఆరోపణలు వెల్లువెత్తాయి. ప్రభుత్వ ఆదేశానుసారం సేవలందించే లోకాయుక్తతో విచారణ పారదర్శకంగా ఉండదని ఫిర్యాదుదారుడు స్నేహమయి కృష్ణతో పాటు భాజపా కూడా సీబీఐ విచారణకు డిమాండ్ చేశారు. ఇదే క్రమంలో ఈడీ దర్యాప్తునకు మనవి చేశారు. ఈ మనవి మేరకు కాకున్నా కనీసం రూ.5 వేల కోట్ల అక్రమాలకు అవకాశం ఉందని కోర్టులు అభిప్రాయపడటంతో పోలీసు రికార్డుల్లోనూ ఇదే తీవ్రతను నమోదు చేశారు. ఈడీ సంస్థ రంగ ప్రవేశం చేసింది. సోమవారం ఆయనపై ఈడీ కేసు నమోదయిందన్న సమాచారంతో కాంగ్రెస్ శిబిరంలో వేడి వాతావరణం నెలకొంది. ఇందుకు కారణం లోకాయుక్త, సీఐడీ, ఎస్ఐటీ అధికారులు ముఖ్యమంత్రి విచారణలో సహజంగానే అలసత్వం పాటిస్తారు. ఆ స్థాయి నేతలను అదుపులో తీసుకునేందుకు కూడా ఆలోచిస్తారు. ఈడీ తీరు వేరు. ఓసారి ఈడీ నుంచి నోటీసు వచ్చిందంటే సదరు నిందితుడి సాధారణ జీవనం అస్తవ్యస్తం అవుతుంది. ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్, మాజీ మంత్రి నాగేంద్ర కేసుల్లో ఈడీ వ్యవహరించిన తీరు తెలిసిందే. కేంద్ర స్థాయి అధికారుల విచారణ కోసం నిందితుడిని అదుపులో తీసుకోవటం, అతనికి సంబంధించిన ఆదాయ వనరులు, ఆస్తులను జప్తు చేయటం చకాచకా జరిగిపోతాయి. అదే జరిగితే ముఖ్యమంత్రి సిద్ధరామయ్యతో పాటు ఆయన కుటుంబ సభ్యులకూ రానున్న రోజులు సంకటమే.

పరమేశ్వర్‌తో డీకే చర్చలు

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ సోమవారం బెంగళూరు సదాశివనగరలో హోం మంత్రి డాక్టర్ పరమేశ్వర్‌తో ప్రత్యేకంగా చర్చలు జరపడం ప్రాధాన్యం సంతరించుకుంది. మైసూరు నగరాభివృద్ధి సంస్థ (ముడా) వ్యవహారానికి సంబంధించి ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఆయన భార్య, బావమరిదిపై కేసు నమోదు- విచారణకు న్యాయస్థానం ఆదేశించిన విషయం తెలిసిందే. ఆ క్రమంలో వీరి చర్చలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. పైకి.. వీరంతా సిద్ధుకు మద్దతు ప్రకటిస్తున్నా చర్చల పరమార్థం ఏమిటోనని రాజకీయులు చెవులు కొరుక్కోవడం ప్రారంభమైంది. సిద్ధు రాజీనామా చేస్తే ఆ పీఠాన్ని స్వాధీనం చేసుకునేందుకు డీకే, పరమేశ్వర్ తదితరులు ప్రయత్నాలు చేస్తున్నారనే అంచనాలూ లేకపోలేదు. 'మేమేమీ రాజకీయాలు మాట్లాడుకోలేదు. ఎత్తినహొళె నీటి ఎత్తిపోతల పథకం అమలుపైనే చర్చించాం' అని డీకే స్పష్టం చేశారు.



మైసూరు నగరాభివృద్ధి సంస్థ కార్యాలయం

ఆ భూమి తిరిగి ఇచ్చేస్తా

ఈనాడు, బెంగళూరు : అవినీతి మరకలేని తన భర్త రాజకీయ జీవితానికి ముప్పు తెస్తున్న 'ముడా'కు చెందిన 14 స్థలాలను తిరిగి అదే సంస్థకు ఇచ్చేస్తున్నట్లు ముఖ్యమంత్రి సిద్ధరామయ్య సతీమణి పార్వతి ప్రకటించారు. లోకాయుక్త, ఈడీ కేసులతో తల్లడిల్లుతున్న సిద్ధరామయ్యకు తన భార్య నిర్ణయం ఏమేరకు ఉపశమనం కలిగిస్తోందో తెలియదు కానీ.. వివాద స్థలాలను తిరిగి ఇవ్వాలన్న నిర్ణయం మాత్రం చర్చనీయాంశంగా మారింది. సోమవారం రాత్రి ఆమె రాసిన ఓ లేఖ సారాంశం.. 'నా భర్త ముఖ్యమంత్రి సిద్ధరామయ్య 40 ఏళ్ల రాజకీయ జీవితంలో ఎలాంటి అవినీతికి పాల్పడకుండా జాగ్రత్తపడ్డారు. ఆయన రాజకీయ, ప్రజా జీవితానికి ఎలాంటి సమస్యా రాకూడదని నేను ఇంటికే పరిమితమై.. జాగ్రత్తగా వ్యవహరిస్తున్నా. ఆయనకు దక్కుతున్న ప్రజాభిమానాన్ని చూసి సంతోషపడినా. ముడాకు సంబంధించిన స్థలాల విషయంలో వచ్చిన ఆరోపణలు విని తీవ్ర మనోవేదనకు లోనయ్యా. మా అన్నయ్య పసుపు కుంకుమల కింద ఇచ్చిన ఈ స్థలాలు ఇంత రాద్ధాంతం చేస్తాయని ఊహించలేదు. నా భర్త గౌరవం, ఘనతకు మించి ఈ ఆస్తులు పెద్దవి కాదు. ఇన్నేళ్లు ఆయన అధికారం నుంచి ఏమీ ఆశించని మాకు ఈ ఆస్తులు తృణప్రాయం. అందుకే ఈ స్థలాలను తిరిగి ముడాకు అప్పగిస్తున్నా. ఈ విషయంలో నా భర్త అభిప్రాయం ఏమిటో తెలియదు. నా కుటుంబ సభ్యులతోనూ చర్చించకుండా నాకు నేనుగా తీసుకున్న నిర్ణయమిది. ఈ ఆరోపణలు వినిపించిన రోజే ఈ నిర్ణయం తీసుకోవాలనుకున్నా. నా భర్త రాజకీయ కుట్రలో మరింత నష్టపోతున్నాడని తెలిసి ఈ నిర్ణయం తీసుకున్నా. అవసరమైతే దర్యాప్తునకు సహకరిస్తా. రాజకీయ రంగానికి దూరంగా ఉండే నాలాంటి ఆడవాళ్లను వివాదాల్లోకి లాగొద్దు' అంటూ విన్నవించారు.

తేనెవలలో వ్యాపారి ఉక్కిరిబిక్కిరి

కలబురగి, న్యూస్‌టుడే : సూపర్ మార్కెట్‌లో గాజుల వ్యాపారం చేసే ఒక వ్యాపారి ముగ్గురు యువతులు, ఎనిమిది మంది యువకులు పన్నిన వలలో చిక్కుకున్నారు. వారి బెదిరింపులు తాళలేక ఇప్పటి వరకు రూ.34.25 లక్షలు వారికి సమర్పించుకున్నారు. వారికి డబ్బులు ఇవ్వలేక చివరికి పోలీసులకు ఫిర్యాదు చేశారు. మహారాష్ట్ర, కలబురగికి చెందిన యువతులతో పాటు రాజు లేంగటి, ప్రభులింగ హిరేమఠ, ఉమేశ్, మంజునాథ కల్యాణి, విక్రం, సాగర్ రాథోడ్, చంద్రకాంత మేగజి, అలీలపై బాధితుడు ఫిర్యాదు చేశారు. యువతులు వ్యాపారిని వలలో వేయించారు. హైదరాబాద్, బెంగళూరుల్లోని హోటళ్లకు వారితో వచ్చి పడక సుఖాన్ని పంచుకుంటున్న సమయంలో రహస్య కెమెరాలతో చిత్రీకరించుకున్నారు. ఆ తర్వాత తమ ఇళ్లకు అతన్ని పిలిపించుకుని, తమ సహచరులకు పట్టించి ఇచ్చారు. తమ వద్ద ఉన్న వీడియోలను చూపించి దశల వారీగా నగదు వసూలు చేశారు. ఇంకో రూ.40 లక్షలు ఇవ్వాలని బెదిరిస్తూ ఉండడంతో నగర ఠాణాలో సోమవారం ఫిర్యాదు చేశారు.

దర్శన్ బెయిల్ పిటిషన్ విచారణ వాయిదా

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : చిత్రదుర్గకు చెందిన రేణుకాస్వామి హత్య కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న సినీ కథానాయకుడు దర్శన్, నటి పవిత్రా గౌడ బెయిలు కోసం వేసుకున్న అర్జీ విచారణ శుక్రవారానికి వాయిదా పడింది. బళ్లారి కారాగారంలో ఉన్న దర్శన్‌ను వీడియో కాన్ఫరెన్సు ద్వారా 57వ సీసీహెచ్ న్యాయస్థానం ముందు హాజరుపరిచారు. దర్శన్ తరఫున సీనియరు న్యాయవాది సీవీ నాగేశ్ వాదనలు వినిపించారు. దర్శన్ అనంతరం నటి పవిత్రాగౌడ, ఇతర నిందితులు రవిశంకర్, లక్ష్మణ్ వేసుకున్న అర్జీలను కూడా న్యాయమూర్తి జైశంకర్ శుక్రవారానికి వాయిదా వేశారు.

పవిత్రోత్సవాలకు స్వస్తివాక్యం



ఆగమ పండితులతో కలిసి పూజ చేస్తున్న అర్చకులు

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : బెంగళూరు వయ్యాలికావల్‌లోని తిరుమల తిరుపతి దేవస్థానంలో వార్షిక పవిత్రోత్సవాలు సోమవారం రాత్రి ముగిశాయి. ఆలయ శుద్ధితో గత శుక్రవారం ఉత్సవాలు ప్రారంభించారు. ఏకాంత సేవ, పవిత్రోత్సవాలకు హాజరయ్యేందుకు భక్తులను అనుమతించారు. యాగశాల వైదిక కార్యక్రమాలు, స్నపన తిరమంజనం, పవిత్ర సమర్పణ, పూర్ణాహుతి, కుంభ ప్రదక్షిణ, ఆచార్య బహుమానం తదితరాలను నిర్వహించారు. పవిత్రోత్సవాలకు ప్రత్యేకంగా వచ్చిన ఆగమ పండితులతో కలిసి అర్చకులు ఉత్సవాలను నిర్వహించారని ఆలయం ఏఈఓ పి.బాలరాజు తెలిపారు.

సమాన వేతన సాధనకు పోరు

బెంగళూరు (శివాజీనగర): ఒప్పంద కార్మికులకు ఉద్యోగ భద్రత, సమానమైన పనికి సమాన వేతనాన్ని ఇవ్వాలంటూ పురపాలికల్లో సేవలందిస్తున్న కార్మికులు సోమవారం బెంగళూరులో ధర్నాకు దిగారు. ఆందోళనకు సీఐటీయూ, ఇతర కార్మిక సంఘాలు మద్దతు పలికాయి. స్వాతంత్య్ర ఉద్యానంలో నిర్వహించిన ధర్నాకు సీఐటీయూ నాయకురాలు వరలక్ష్మి నేతృత్వం వహించారు.



నినాదాలు చేస్తున్న ఆందోళనకారులు

పాక్, బంగ్లావాసుల నిగూఢ జీవనం

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే : కన్నడిగుల రాజధానినగరి బెంగళూరు శివారు జిగణిలోని అపార్ట్‌మెంట్‌లో అక్రమంగా ఉంటున్న ఇద్దరు విదేశీ దంపతులు, వారి ఇద్దరి పిల్లలను పోలీసులు అరెస్టు చేశారు. పాకిస్థాన్‌కు చెందిన వ్యక్తి, బంగ్లాదేశ్ చెందిన అతని భార్య, వారి ఇద్దరు పిల్లలు 2018 నుంచి ఇక్కడే ఉంటున్నారని గుర్తించామని జిగణి ఠాణా ఇన్‌స్పెక్టర్ మంజునాథ్ తెలిపారు. నిందితుడు తన పేరును శంకర్‌శర్మ అని పెట్టుకున్నాడు. అతని అసలు పేరుపై దర్యాప్తు చేస్తున్నామని వివరించారు. ఇటీవల జాతీయ దర్యాప్తు దళం గిరీశ్ బోరా అలియాస్ గౌతమ్ అనే వ్యక్తిని అరెస్టు చేసింది. అతని నుంచి సేకరించిన సమాచారం ఆధారంగా వీరిని బంధించామని అధికారులు చెప్పారు. పాకిస్థాన్‌కు చెందిన ఆ 'శంకరశర్మ' బంగ్లాదేశ్‌కు వెళ్లి కొన్నేళ్లున్న అతను.. అక్కడి యువతిని వివాహం చేసుకున్నాడు. పిల్లలు పుట్టిన అనంతరం వారితో కలిసి దేశంలోకి అక్రమ మార్గంలో ప్రవేశించాడని వివరించారు. దిల్లీకి 2014లో చేరుకున్నాడు. అక్కడే ఆధార్ కార్డు, డ్రైవింగ్ లైసెన్సు, పాస్‌పోర్టు చేయించుకున్నాడు. దిల్లీ నుంచి బెంగళూరుకు 2018లో వచ్చి, జిగణిలో ఉంటున్నాడు. నిఘా దళాలు ఇచ్చిన సమాచారంతో పోలీసులు దాడులు చేసి పట్టుకున్నారు. అతని అపార్ట్‌మెంట్ ఫ్లాట్ నుంచి ల్యాప్‌టాప్ జప్తు చేసుకున్నారు.



మంత్రులు, ఉన్నతాధికారులు, సినీరంగ ప్రముఖులతో సిద్ధరామయ్య

చిత్రనగరి నిర్మాణానికి చర్యలు

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : కన్నడ చలన చిత్ర పరిశ్రమ అభివృద్ధి కోసం మైసూరు జిల్లా ఇమ్మావు గ్రామ సమీపంలో 'చిత్రనగరి' నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టి, ఇప్పటికే 50 ఎకరాల భూమి సేకరించినట్లు ముఖ్యమంత్రి సిద్ధరామయ్య వెల్లడించారు. అదనంగా 70 ఎకరాల కోసం భూసేకరణబాధ్యతలను కర్ణాటక ప్రదేశ్ పారిశ్రామిక వాడ అభివృద్ధి మండలికి అప్పగించామని వివరించారు. బెంగళూరులోని తన నివాస కార్యాలయంలో ఆయన సోమవారం సంబంధిత మంత్రులు, ఉన్నతాధికారులు, చిత్రపరిశ్రమ ప్రముఖులతో సమావేశమయ్యారు. చిత్రనగరిలో అవసరమైన భవనాలు, థియేటర్లు, హోటళ్లు, ప్రయోగశాలలు నిర్మిస్తారని వివరించారు. మంత్రులు డాక్టర్ మహదేవప్ప, హెచ్.కె.పాటిల్, కృష్ణబైరేగౌడ, ముఖ్యమంత్రి రాజకీయ కార్యదర్శి గోవిందరాజు, ముఖ్యమంత్రి కార్యదర్శి డాక్టర్ కె.వి.త్రిలోక్‌చంద్ర, వార్తప్రసారాల శాఖ కమిషనర్ హేమంత్ నింబాళ్కర్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రశేఖర్‌పై ఫిర్యాదు

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : కేంద్ర మంత్రి హెచ్.డి.కుమారస్వామిని తన లేఖలో పందితో పోల్చిన లోకాయుక్త ఏడీజీపీ చంద్రశేఖర్‌పై చర్యలు తీసుకోవాలని జనతాదళ్ శాసనసభ్యులు సోమవారం విధానసౌధలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాలిని రజనీశ్‌ను డిమాండు చేశారు. ఈమేరకు వారొక వినతిపత్రం ఆమెకు అందించారు. ఎమ్మెల్యేల బృందానికి సురేష్ బాబు నాయకత్వం వహించారు. కేంద్ర మంత్రిని ఏడీజీపీ అవమానించారని ధ్వజమెత్తారు. తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు.



ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాలినిరజనీశ్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న ఎమ్మెల్యేలు

సందడిగా బొమ్మల పండగ!



బొమ్మల్ని చూసి మురిసిపోతున్న బాలికలు

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : దసరా వస్తూనే సరదా తీసుకువస్తుంది.



వీణా వాదనలో ఆంజనేయుడు

పండగకు బొమ్మల కొలువు ఏర్పాటు చేసుకునేవారు పాత మైసూరు జిల్లాల్లో ఇప్పటికీ వందల సంఖ్యలో ఉన్నారు. ఏడాది మొత్తం తాము సేకరించిన బొమ్మలను కొలువు పెట్టి తమ బంధువులు, మిత్రులు అందరినీ ఇంటికి ఆహ్వానించి చూపిస్తుంటారు. పండగ పూర్తయిన తర్వాత ఆ బొమ్మల్ని తీసి శుభ్రం చేసి దాచి పెడుతుంటారు. వచ్చే ఏడాది పండగకు మళ్లీ వాటిని బయటకు తీసి అలంకరణలో పెడుతుంటారు. బొమ్మల కొలువు కోసమే నగరంలోని కొన్ని వ్యాపార సంస్థలు రకరకాల బొమ్మలను తీసుకువచ్చి విక్రయిస్తున్నాయి. మల్లేశ్వరంలోని దుకాణంలోని బొమ్మలను కొనుగోలు చేసేందుకు వినియోగదారులు ఆసక్తి చూపిస్తున్నారు.



అమ్మవారి విగ్రహం ముందు భక్తులు

కలుషిత నీరు తాగి 30 మందికి అస్వస్థత

కలబురగి, న్యూస్‌టుడే : కలుషిత నీరు తాగి ఆళంద తాలూకా నింబర్గ గ్రామంలో 30 మందికి పైగా స్థానికులు అస్వస్థతకు గురయ్యారు. బాధితులను చికిత్స కోసం ఆళందలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గ్రామంలో కుళాయిల నీటిని సరఫరా చేసే ట్యాంకును శుభ్రం చేయకపోవడంతోనే నీరు కలుషితమైందని గుర్తించారు. ఆరోగ్య శాఖ అధికారులు గ్రామానికి చేరుకుని పరిస్థితులను సమీక్షించారు. నీటి ట్యాంకును సోమవారం మధ్యాహ్నం శుభ్రం చేయించారు.

సామాన్యుడి దసరాకు సర్కారు నిధులేవీ?

మంగళూరు, న్యూస్‌టుడే : ప్రభుత్వం, రాజవంశస్థులు నిధులు కేటాయించకపోయినా మంగళూరులో దసరా ఉత్సవాలు ప్రతి ఏటా సంప్రదాయంగా నిర్వహిస్తున్నారు. మంగళూరు దసరా ఉత్సవాలను సామాన్యుడి (కామన్ మ్యాన్) దసరా అని వ్యవహరిస్తుంటారు. కుద్రోళి గోకర్ణనాథ ఆలయం కేంద్రంగా దసరా ఉత్సవాలను ఆచరిస్తుంటారు. దసరాకు జాతా, కార్యక్రమాలు, పూజలు, నవదుర్గ విగ్రహాల ఏర్పాటు బాధ్యతలు ఆలయ సమితే చేపడుతుంది. ఈ ఏడాది ఊరేగింపు సమయంలో ఐదు లక్షల మంది హాజరవుతారని, తొమ్మిది రోజులకు కలిపి 12 లక్షల మంది భక్తులు వస్తుంటారని ఆలయ ప్రతినిధులు అంచనా వేశారు. ఉత్సవాల నిర్వహణకు వచ్చే ఖర్చును కేంద్ర మాజీ మంత్రి బి.జనార్దన పూజారి, భక్తులు ఇచ్చే విరాళాలతోనే నిర్వహిస్తున్నారు. అక్టోబరు 3 నుంచి 14 రోజులు ఉత్సవాలు ఉంటాయి. కేరళ నుంచి మంగళూరుకు వచ్చిన సామాజిక సంస్కర్త నారాయణ గురు 1912లో ఇక్కడ ఉత్సవాలను ప్రారంభించారు. అప్పటి నుంచి ఇక్కడ ఉత్సవాలు జరుగుతున్నాయని జనార్దన పూజారి గుర్తు చేశారు.

పొలంలో దిగిన సైనిక విహంగం



సైనిక హెలికాప్టర్ చుట్టూ భద్రత


కోలారు, న్యూస్‌టుడే : సాంకేతిక లోపంలో సైనిక హెలికాప్టర్ బంగారపేట తాలూకా దొడ్డూరు కరపన హళ్లి చెరువుకు సంబంధించిన భూమిలో ఆదివారం సాయంత్రం కిందకు దించారు. ఒక మహిళా పైలెట్‌తో సహా, మరో పైలెట్ ఇందులో ప్రయాణిస్తున్న సమయంలో సాంకేతిక సమస్యను గుర్తించి, అత్యవసరంగా కిందకు దించారు. సైనికాధికారులు సోమవారం ఉదయం ఇక్కడకు చేరుకుని హెలికాప్టర్‌లోని సమస్యను పరిశీలించి వెళ్లారు. రక్షణ దళ సిబ్బందితో పాటు బంగారపేట ఠాణా పోలీసులను భద్రత కోసం నియమించారు. హెలికాప్టర్‌ను సమీపం నుంచి చూసేందుకు స్థానికులు చుట్టుముట్టారు.

ఆకాశగంగకు దోసిలిపడితే పులకింత!

'బెంగళూరు' భవితకు అదే శ్రీరామరక్ష



శివార్లలో వాననీటి సంరక్షణకు చర్యలు



చెరువుల సంరక్షణకు పెద్దపీట



మురుగునీటి శుద్ధీకరణ విధానాల విస్తరణ



ఓ ఉద్యానవనంలో ఇంకుడు గుంత

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : నదులు, వాగులు లేని సముద్రమట్టానికి 12 వందల మీటర్ల ఎత్తులో ఉన్న బెంగళూరు నగరంలో వానీనటి సంరక్షణే శ్రీరామరక్ష. ఆ అంశాన్ని విస్మరిస్తే జలక్షామం తప్పదని అంతర్జాతీయ నీటి సంరక్షణ పరిశోధన సంస్థ హెచ్చరించాక కూడా పాలకుల్లో స్పందన కరవు. ఇప్పటి నుంచే ఈ చర్యలు చేపట్టకపోతే భవిష్యత్తులో ప్రజలు నానా అగచాట్లు చవిచూడక తప్పదని లండన్‌కు చెందిన ఆ సంస్థ ఐదేళ్ల కిందట హెచ్చరించిన విషయం తెలిసిందే. ఆ హెచ్చరికలను పాలకులు పట్టించుకోలేదు. దాని ఫలితం వర్షాకాలంలోనూ నగరవాసులు అనుభవిస్తున్నారు. వాననీటికి దోసిలి పడితే.. అనేక సమస్యల నుంచి గట్టెక్కవచ్చని నగరంలోనే విస్తరించిన భారతీయ విజ్ఞాన సంస్థ (ఐఐఎస్సీ) పదేపదే హెచ్చరిస్తోంది. నగలు, వాగులు లేని బెంగళూరు నగరం పూర్తిగా వాననీటిపై ఆధారపడాలి. వంద కిలోమీటర్ల దూరం నుంచి నిత్యం 1450 ఎంఎల్‌డీ 'కావేరి' నదీజాలలను సరఫరా చేస్తున్నారు. అంతకు పూర్వం నగరవాసులు భూగర్భజలాలపై ఆధారపడేవారు. పూర్వపు రాజు- నగర నిర్మాత కెంపే గౌడ వాననీటి సంరక్షణ కోసం చెరువులు విస్తారంగా తవ్వించారు. ఆనాటి నుంచి వాననీటిని ఒడిసి పట్టుకున్న చెరువులే నగరాన్ని ఆదుకున్నాయి. భూగర్భ జలాల మట్టం పెరిగి బావులు కళకళలాడేవి. కాలక్రమంలో కెంపేగౌడ తవ్వించిన వెయ్యికిపైగా చెరువులు కనమరుగై ప్రస్తుతం 86కు కుదించుకపోయాయి. అవీ ఎప్పుడు మాయమవుతాయో తెలియని దుస్థితి. ప్రస్తుతానికి కావేరి నీటిని తరలించుకొస్తున్నా.. అదెంతో వ్యయప్రయాసలమయం. ఇప్పటికైనా వాననీటి సంరక్షణ మరోసారి ప్రారంభించి కొనసాగిస్తూ భూగర్భజలాల మట్టం పెరుగుతుందని జల నీటి నిపుణుడు డాక్టర్ శివకుమార్ 'న్యూస్‌టుడే'కి వివరించారు. నగరానికి చెరువలోని తిప్పగుండనహళ్లి, హెసరుఘట్ట, బెళ్లందూరు, వర్తూరు, యలహంక తదితర చెరువులను సిద్ధం చేస్తే తాగునీటి ఎద్దడి నివారించవచ్చు. కావేరి నీరు సరఫరా కాకముందు సగం బెంగళూరుకు తిప్పగుండనహళ్లి, హెసరుఘట్ట చెరువులు దాహం తీర్చడం ప్రస్తావనార్హం. భవనాలకు అనుబంధంగా ఆకాశగంగకు చోటిచ్చే నిర్మాణాలు చేపడితే సగం సమస్య అదుపులోకి వస్తుందన్నారు. తప్పనిసరిగా వాననీటి సంరక్షణ చర్యలు చేపట్టాలనే చట్టం తెచ్చిన క్రమంలో అధికారులు సక్రమంగా నిబంధనలు అమలు చేయాలనే డిమాండు తెరపైకి వచ్చింది.

దత్తతతో ఆనెగుంది అభివృద్ధి



వివరాలు వెల్లడిస్తున్న న్యాయమూర్తి సదానంద నాయ్కు తదితరులు

గంగావతి,న్యూస్‌టుడే: గాంధీ జయంతి పురస్కరించుకుని ఆనెగుంది దత్తత తీసుకుని అభివృద్ధి చేయనున్నట్లు ఆదివారం జిల్లా న్యాయస్థానం న్యాయమూర్తి సదానంద నాయ్కు తెలిపారు. ఆయన సోమవారం గంగావతి న్యాయస్థానం ఆవరణలో విలేకరులతో మాట్లాడారు. ఇప్పటికే గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి సమస్యలను ఆలకించినట్లు చెప్పారు. 570 సమస్యలను జాబితా చేశామన్నారు. వీటిలో హంపీ ప్రాధికార నుంచి నిరభ్యంతర పత్రాలు, వృద్ధాప్య, దివ్యాంగ, వితంతు పింఛన్లు ఇవ్వాల్సి ఉన్నాయన్నారు. ప్రపంచ వారసత్వ జాబితాలో ఉన్న ఈ ప్రాంతానికి దేశ, విదేశాల నుంచి పర్యాటకులు వస్తుంటారని, వారు మరుగుదొడ్ల వంటి సమస్యలను ఎదుర్కొంటున్నట్లు చెప్పారు. మొక్కలు పెంచడం, ప్లాస్టిక్ నిషేధంపై సైతం అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. న్యాయమూర్తి నాగేశ్ పాటిల్, న్యాయవాదుల సంఘం ప్రతినిధులు మల్లికార్జున ముసలి, మంజునాథ్ హిరేమఠ పాల్గొన్నారు.

కేంద్ర పథకానికి 59 గ్రామాల ఎంపిక



జిల్లా పాలనాధికారి ప్రశాంత్‌కుమార్ మిశ్రా

బళ్లారి, న్యూస్‌టుడే: ప్రధానమంత్రి జన్‌జాతీయ ఉన్నత్ గ్రామ్ అభియాన్ కింద జిల్లాలోని ఐదు తాలూకాల్లో 59 గ్రామాలు ఎంపికైనట్లు జిల్లా పాలనాధికారి ప్రశాంత్‌కుమార్ మిశ్రా తెలిపారు. ఈ 59 గ్రామాల్లో శుద్ధమైన తాగునీరు, రహదారులు, పక్కా గృహాలు, మురుగు కాలువ, ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలు, ఆసుపత్రులు తదితర మౌలిక సౌకర్యాలు లేక గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దేశ వ్యాప్తంగా గిరిజన గ్రామాలు అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం రూ.79,156 కోట్లు నిధులు కేటాయించింది. ఈ నిధులను దేశ వ్యాప్తంగా గిరిజనులు జీవనం సాగిస్తున్న గ్రామాలు 63 వేలు ఉన్నాయి. వాటిలో బళ్లారి జిల్లాలో ఐదు తాలూకాల్లో 59 గ్రామాలు ఉన్నాయన్నారు. ఆ గ్రామాల్లో చేసిన వివిధ అభివృద్ధి పనులకు సంబంధించిన నివేదికను కేంద్రానికి పంపినట్లు డీసీ తెలిపారు.



న్యాయాలయ ఆవరణలో స్వచ్ఛత కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సంఘం అధ్యక్షుడు వెంకోబ, ఇతర అధికారులు

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యకర వాతావరణం

సిరుగుప్ప: పరిసరాల శుభ్రతతో ఆరోగ్యకర వాతావరణం నెలకొంటుందని న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ఉప్పార వెంకోబ పేర్కొన్నారు. పట్టణ సేవా సమితి, న్యాయవాదుల సంఘం, నగరసభ సంయుక్త ఆధ్వర్యంలో న్యాయాలయ ఆవరణలో సోమవారం స్వచ్ఛత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో గృహాలు, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, రహదారులు వంటి ప్రదేశాల్లో చెత్తాచెదారం పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తే దోమలు రాకుండా ఆరోగ్యకర వాతావరణం నెలకొంటుందన్నారు. న్యాయవాదులు అబ్దుల్‌సాబ్, మల్లిగౌడ, హేమలత, స్వరోజ, నగరసభ ఆరోగ్య అధికారులు స్వర్ణలత, రంగస్వామి, న్యాయాలయ ఉద్యోగులు, పౌరకార్మికులు పాల్గొన్నారు.

దర్శన్‌తో విజయలక్ష్మి భేటీ



బ్యారక్ నుంచి దర్శన్‌ను తీసుకొస్తున్న జైలు అధికారులు, సిబ్బంది



దర్శన్‌ను కలిసి వెనుదిరిగొస్తున్న సతీమణి విజయలక్ష్మి, కుటుంబసభ్యులు

బళ్లారి, న్యూస్‌టుడే: చిత్రదుర్గం జిల్లా రేణుకాస్వామి హత్య కేసులో అరెస్టై బళ్లారి కేంద్ర కారాగారంలో ఉంటున్న సినీ నటుడు దర్శన్‌ను ఆయన సతీమణి విజయలక్ష్మి సోమవారం కలిశారు. విజయలక్ష్మితోపాటు సోదరుడు దినకర్, నటుడు ధన్వీర్, సుశాంత నాయుడు తదితరులు సాయంత్రం 4.14 గంటలకు బెంగళూరు నుంచి నేరుగా కారాగారానికి చేరుకున్నారు. రెండు సంచులతో జైల్లోకి ప్రవేశించారు. ప్రత్యేక బ్యారక్‌లో ఉన్న దర్శన్‌ను విశ్రాంతి గదికి తీసుకొచ్చారు. ఆ సమయంలో దర్శన్ చేతిలో రెండు సంచులు ఉన్నాయి. 5.08 గంటల వరకు భార్య, కుటుంబసభ్యులతో మాట్లాడారు. సోమవారం కోర్టులో బెయిల్ కోసం అర్జీ దాఖలుపై చర్చించినట్లు సమాచారం. దర్శన్ ఆందోళనకు గురైనట్లు ఆయన ముఖంలో కనిపించింది. బెయిల్ మరో సారి వాయిదా పడటంతో ముందు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కుటుంబసభ్యులతో చర్చించినట్లు సమాచారం. సతీమణి బెంగళూరు నుంచి తెచ్చిన రెండు సంచులను భర్తకు అందజేసింది. దుస్తులు, బేకరీ పదార్థాలు, పండ్లు ఉన్నట్లు జైలు అధికారులు తెలిపారు. దర్శన్ సతీమణి బళ్లారికి రావడంతో తెలుసుకున్న అభిమానులు జైలు వద్దకు పెద్ద సంఖ్యలో వచ్చారు. ముందు జాగ్రత్తగా గాంధీనగర్ పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. సాయంత్రం 5.11గంటలకు విజయలక్ష్మి ప్రత్యేక వాహనంలో బెంగళూరుకు బయలుదేరి వెళ్లారు.

దుర్గమ్మకు 'గాలి' అభిమానుల పూజలు

బళ్లారి న్యూస్‌టుడే: మాజీ మంత్రి, ఎమ్మెల్యే గాలి జనార్దన్‌రెడ్డిని బళ్లారి జిల్లాకు రావడానికి కోర్టు అనుమతి ఇవ్వడంతో అభిమానులు బళ్లారి కనక దుర్గమ్మకు సోమవారం ప్రత్యేక పూజలు చేసి 101 టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఆటో సంఘం అధ్యక్షుడు, భాజపా కార్యకర్త హుండేకర్ రాజేశ్ నేతృత్వంలో సోమవారం మధ్యాహ్నం బళ్లారి కనక దుర్గమ్మ దేవస్థానానికి చేరుకుని గాలి జనార్దన్‌రెడ్డి పేరిట ప్రత్యేక పూజలు చేయించారు. కార్యకర్తలు గాదిలింగ, నాగరాజ్, మారేశ్, రామాంజిని, దుర్గణ్ణ, చంద్ర, శంకర్, బసప్ప, ధనంజయ్ పాల్గొన్నారు.



దుర్గమ్మకు మొక్కులు తీర్చుకుంటున్న గాలి అభిమానులు

మాతృభాషలో అనువాద రచనలు పెరగాలి



వర్సిటీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతున్న సహ ప్రాధ్యాపకుడు డాక్టర్ జాజి దేవేంద్రప్ప

హొసపేటె, న్యూస్‌టుడే: ఇతర భాషల్లోని ఉత్తమ రచనలు, పుస్తకాలను కన్నడ భాషలోకి అనువాదం చేయాల్సిన అవసరం ఉందని గంగావతి ప్రభుత్వ కళాశాల సహ ప్రాధ్యాపకుడు డాక్టర్ జాజి దేవేంద్రప్ప పేర్కొన్నారు. హంపీ వర్సిటీలో సోమవారం ఏర్పాటు చేసిన అనువాద దినోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కన్నడ భాష పుస్తకాలను ఇతర భాషల్లోకి తర్జుమా చేయడంతో, ఇక్కడి భాషా సంపదను వేరే రాష్ట్రాలకు పరిచయం చేసినట్లవుతుందని పేర్కొన్నారు. అనువాదం అంత సులభమైన పనికాదు. చిన్న పుస్తకాన్ని కూడా అనువాదం చేయాలన్న పలు జాగ్రత్తలు పాటించాలని హెచ్చరించారు. లేనిపక్షంలో అవాంతరాలు జరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. అనువాదం చేయాలంటే భాషపై పట్టు చాలా అవసరమని నొక్కిపలికారు. అధ్యక్షత వహించిన వర్సిటీ ఉప కులపతి డాక్టర్ డి.వి.పరమశివమూర్తి మాట్లాడుతూ వర్సిటీలో తర్జుమా విభాగం క్రియాశీలంగా పనిచేస్తోందని తెలిపారు. భాషాంతర అధ్యయన విభాగం ముఖ్యుడు డాక్టర్ మోహన్‌కుంటార్ పాల్గొన్నారు.

పరిశుభ్రత అందరి బాధ్యత



స్వచ్ఛభారత్ కార్యక్రమంలో మాట్లాడుతున్న వైద్య అధికారులు, వైద్యులు, అధికారులు

బళ్లారి, న్యూస్‌టుడే: మనం నివసించే ఇళ్లు, పనిచేసే కార్యాలయాలను పరిశుభ్రంగా ఉంచుకోవడానికి ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖాధికారి డా.యల్లా రమేష్‌బాబు సూచించారు. సోమవారం ఉదయం రాష్ట్రీయ స్వచ్ఛత అభియాన్ కింద జిల్లా ఆసుపత్రి ఆవరణలో స్వచ్ఛ సేవా అభియాన్‌ను డీహెచ్‌వో ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రీయ స్వచ్ఛత అభియాన్ కింద అన్ని ఆసుపత్రుల్లో రోగుల ఆరోగ్య పరిరక్షణకు కాయకల్ప కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వైద్య వ్యర్థాలను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా నిబంధన ప్రకారం రోజూ కేటాయించిన ప్రదేశాల్లో వేయాలన్నారు. జిల్లా ఆసుపత్రి బాధ్యుడు డా.ఎన్.బసరెడ్డి మాట్లాడుతూ జిల్లా ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన చికిత్సతో పాటు ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతున్నట్లు వివరించారు. వైద్యులు వీరేంద్రకుమార్, హనుమంతప్ప, గురునాథ చౌహాన్, ప్రియాంక్, అధికారి ఈశ్వర్ దాసప్పనవర, జిల్లా ఆసుపత్రి నర్సింగ్ ముఖ్య అధికారి విమలాక్షి, ఉదయశ్రీపతి, హనుమరామ, విజయకుమార్, బసవరాజ్, రవిచంద్ర, వెంకటేశ్, రాఘవేంద్ర వ్యర్థాలను తొలగించారు.

రూ.30 కోట్లతో అభివృద్ధి పనులు



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి, మేయర్ ముల్లంగి నందీష్, మండలి అధ్యక్షుడు ముండరగి నాగరాజ తదితరులు

బళ్లారి, న్యూస్‌టుడే: బళ్లారి ప్రభుత్వ తారానాథ ఆయుర్వేద కళాశాల, ఆసుపత్రిలో కె.ఎం.ఇ.ఆర్.సి.నిధుల్లో రూ.30 కోట్లతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి, మేయర్ ముల్లంగి నందీష్, రాష్ట్ర మండలి అధ్యక్షుడు ముండరగి నాగరాజు సోమవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి మాట్లాడుతూ కొన్నేళ్లుగా ప్రజలకు మెరుగైన చికిత్స అందజేస్తున్న తారానాథ ఆసుపత్రి, కళాశాల భవనాలు ఆధునికీకరణ, బోధన గదులు, ఔషధ విభాగం భవనం, తదితర వాటిని నిర్మిస్తున్నట్లు చెప్పారు. రెండేళ్లుగా కె.ఎం.ఇ.ఆర్.సి. నిధులను ఆసుపత్రికి కేటాయించాలని ప్రయత్నిస్తున్నాం. కొంత మంది కోర్టుకు వెళ్లారు. కె.ఎం.ఇ.ఆర్.సి. ఛైర్మన్ సుదర్శన్‌రెడ్డి ప్రస్తుత పరిస్థితిని వివరించి రూ.30 కోట్లు కేటాయించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

రూ.1200 కోట్లతో తాగునీటి పథకం

బళ్లారి నగర వాసులు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. మరో 50 ఏళ్ల పాటు నగర వాసులకు తాగునీటికి ఇబ్బందులు రాకుండా ముందు జాగ్రత్తగా తుంగభద్ర జలాశయం నుంచి బళ్లారి నగరానికి గొట్టాల ఏర్పాటుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు మేయర్ తెలిపారు. దీని కోసం రూ.1200 కోట్లు ఖర్చు అవుతుంది. కె.ఎం.ఇ.ఆర్.సి. నిధుల నుంచి రూ.1200 కోట్లు కేటాయించాలని నివేదికను సిద్ధం చేసి ప్రభుత్వంతో పాటు ఛైర్మన్‌కు అందజేసినట్లు పేర్కొన్నారు. ఈ పనులను మరో నెలల్లో ప్రారంభిస్తామన్నారు. కళాశాల ప్రధాన ఆచార్యులు డా.సయ్యద్ అత్తర్ పాతిమా, కార్పొరేటర్లు నూర్ అహ్మద్, కవిత హొన్నప్ప, రామాంజినేయులు, సీనా, హొన్నప్ప పాల్గొన్నారు.

మెట్రో.. మహాసేవల హారం!





ఆర్.వి.రోడ్డు ఉపరితల మెట్రోస్టేషన్

ఆర్.వి.రోడ్డు-బొమ్మనహళ్లి మార్గంలో చోదకుడి అవసరంలేని మెట్రో

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : ఆసియాలో అతి ఎత్తైన మెట్రో ప్రయాణ ప్రాంగణం బెంగళూరు నగరంలోని 'జయనగర'లో ఈ ఏడాది ఆఖరిలో ప్రారంభం కానుంది. ఆ ప్రాంగణం మీదుగా చోదకుడులేని మెట్రో రైలు ప్రయోగాత్మకంగా పరుగులు తీస్తోంది. ఆరు విభాగాలుగా విరాజిల్లే ప్రాంగణం రహదారి కన్నా 29 మీటర్ల ఎత్తులో విస్తరించింది. దీని నిర్మాణానికి రూ.200 కోట్లు వ్యయం చేశారు. ఆర్‌వీ రహదారి- బొమ్మనహళ్లి మధ్య దూరం 18.9 కిలోమీటర్లు. ఈ పరిధిలోనే 'జయదేవ' మెట్రో రూపుదాల్చింది. ఈ మార్గం మొదటి దశలో డెయిరీ కూడలి నుంచి బన్నేరుఘట్ట వరకు భూగర్భ అండర్‌పాస్ మార్గాన్ని ఒదిగిపోయేలా చేశారు. రెండో దశలో రాగిగుడ్డ- సెంట్రల్ సిల్క్‌బోర్డు వరకు సాగే రహదారి, మూడు దశ డబుల్ డెక్కర్ దారి, నాలుగో అంతస్తుగా.. జయదేవ ఆసుపత్రి కూడలి నుంచి సెంట్రల్ సిల్క్ బోర్డు వరకు ఎలివేటెడ్ మార్గం, ఐదో అంతస్తు.. గొట్టిగెరె- నాగవార మెట్రో మార్గం, చివరి ఆరో దశలో ఆర్.వి. రోడ్డు- బొమ్మసంద్ర రైలుమార్గం! ఈ మహా కూడలి (జంక్షన్) ఇకపై నిత్యం లెక్కలేనన్ని నాజూకు రైళ్లతో హోరెత్తనుంది. ప్రస్తుతానికి.. చోదకుడిలేని మెట్రో నమూనా పరుగు, డబుల్ డెక్కర్ మార్గంపై వాహనాలు సంచరిస్తున్నాయి. భవిష్యత్తులో ప్రతి 15 నిమిషాలకు ఎనిమిది మెట్రో రైళ్ల రాకపోకలు సాగిస్తాయని బీఎంఆర్‌సీఎల్ అధికార ప్రతినిధి యశ్వంత్ చౌహాన్ తెలిపారు. ఏడాది ఆఖరిలోగా డ్రైవర్ రహిత మెట్రో రైలు ప్రజావసరాలు తీరుస్తుందని తెలిపారు.



అతి ఎత్తైన ప్రాంతంలో విస్తరించిన జయదేవ ఆసుపత్రి కూడలిలో ప్రయాణ ప్రాంగణం



ఐటీ నడవా గుండా మెట్రో మార్గం సేవలు

ముందు జాగ్రత్తలతో డెంగీ నియంత్రణ

బళ్లారి, న్యూస్‌టుడే: డ్రమ్ములు, సిమెంటు తొట్టెలు, చెరువుల్లో దోమల లార్వా కనిపించిన వాటిపై నిర్లక్ష్యం చేయకూడదు...ఆ దోమల నుంచి డెంగీ వ్యాపించే అవకాశాలు ఉన్నాయి. వాటి నివారణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖాధికారి డా.యల్లా రమేష్‌బాబు అధికారులకు సూచించారు. జిల్లా యంత్రాంగం, పంచాయతీ, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ, సిద్ధమ్మనహళ్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో కురుగోడు తాలూకా సిద్ధమ్మనహళ్లి గ్రామంలో ఈడిస్ దోమల నివారణపై సర్వే నిర్వహించి, ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించారు. ఇళ్ల వద్ద నీటిని నిల్వ చేసిన డ్రమ్ములు, సిమెంట్ తొట్టెలు, ట్యాంకులు, పాత్రల్లో నిల్వ చేసిన మంచి నీటిని పరిశీలించారు. వాటిలో దోమల ఉత్పత్తిని గుర్తించి వాటిని నివారించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. జిల్లా అంటువ్యాధుల నియంత్రణాధికారి డా.అబ్దుల్లా మాట్లాడారు. డా.దివ్యా, అధికారి నందాకడి, ఈశ్వర్ దాసప్పనవర, డా.నివేదిత, తిప్పేస్వామి, సవిత, మరిబసవనగౌడ, శ్వేత, బాబురావ్ పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డీహెచ్‌వో డా.యల్లా రమేష్‌బాబు తదితర వైద్యులు అధికారులు

ఆర్టీసీ బస్సు బోల్తాపడి 15 మందికి గాయాలు



హిరియూరు తాలూకా ఓబుళాపురం తాండా వద్ద రహదారి పక్కన బోల్తా పడిన ఆర్టీసీ బస్సు



బస్సులో నుంచి విద్యార్థులను బయటకు తీస్తున్న గ్రామస్థులు

చెళ్లకెర(చిత్రదుర్గం),న్యూస్‌టుడే: హిరియూరు తాలూకా ఓబుళాపురం తాండా గ్రామం వద్ద ఆర్టీసీ బస్సు అదుపు తప్పి రహదారి పక్కనున్న గుంతల్లో బోల్తా పడింది. ఈ ఘటనలో 15 మంది ప్రయాణికులు, విద్యార్థులు గాయపడిన సంఘటన సోమవారం జరిగిందని పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల మేరకు.. ఓబుళాపురం గ్రామం నుంచి 40 మంది విద్యార్థులు, ప్రయాణికులను ఎక్కించుకొని జవనగొండనహళ్లి మీదుగా హిరియూరుకు బయలుదేరిన బస్సు తాండా వద్దకు రాగానే రహదారి పక్కనున్న గుంతలో బోల్తా పడింది. బస్సు డ్రైవర్ వైపు నేల వైపు ఒరిగిపోవడంతో లోపల ఉన్న విద్యార్థులు, ప్రయాణికులు బయటకు రాలేక ఇబ్బందులను ఎదుర్కొన్నారు. వెంటనే అక్కడకు సమీపంలోని గ్రామ ప్రజలు హుటాహుటిన పరుగెత్తుకొని వచ్చి సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను అంబులెన్సుల్లో హిరియూరులోని ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు.

మూఢ విశ్వాసాలు వీడండి



మాట్లాడుతున్న విశ్రాంత చరిత్ర ఉపన్యాసకుడు బసవరాజు, చిత్రంలో పనుమేశలు, నెగళూర మఠ, సిద్ధలింగప్ప తదితరులు

బళ్లారి, న్యూస్‌టుడే: ఆధునిక యుగంలో మూఢ నమ్మకాలతో ముందుకు వెళ్లడం సరికాదు.. విజ్ఞానంతో ముందుకు వెళ్తే మంచి భవిష్యత్తు ఉంటుందని విశ్రాంత ఉపన్యాసకుడు బసవరాజ తెలిపారు. భవానీ చిత్రకళ మహావిద్యాలయం, జిల్లా శరణ సాహిత్య పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం తుళజమ్మ, లక్కప్ప జాధవ్, నబీసాబ్, హొన్నూరమ్మ జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన దాతల కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. మన పూర్వీకులు చేసిన వివిధ కార్యక్రమాలను స్మరించుకోవడం మన ధర్మమన్నారు. వారు చేసిన కార్యక్రమాలను ఆదర్శంగా తీసుకుని ముందుకు వెళ్లాలన్నారు. కొప్పళ జిల్లా శిక్షణ కేంద్రం అధ్యాపకులు పరమేశు మాట్లాడుతూ విశేషంగా చిత్రకళాకారులకు ప్రశాంతత, ఓర్పు, సహనం, నైపుణ్యం చాలా ముఖ్యమన్నారు. విశ్రాంత చిత్రకళ విభాగ ఉపాధ్యాయులు నెగళూరుమఠ, కాయక రత్న పురస్కారం పొందిన గెణికెహళ్ ప్రభుత్వ పాఠశాల చిత్రకళ ఉపాధ్యాయులు ఎం.బసవరాజను వేదికపై సన్మానించారు. ఆర్.ఎల్.జాధవ్, కప్పగల్లు రసూల్‌సాబ్, శరణ సాహిత్య పరిషత్ అధ్యక్షులు కె.బి.సిద్ధలింగప్ప, ప్రేమలత, పంపనగౌడ, ముస్తాక్, కొట్రేశ్, కొట్రప్ప పాల్గొన్నారు.

కాలు తొక్కాడని కత్తితో పొడిచి చంపాడు

బెంగళూరు (సదాశివనగర) : తన కాలు తొక్కాడన్న కోపంతో మూర్తి (52) అనే పాల వ్యాపారిని కీర్తి (27) అనే యువకుడు హత్య చేశాడు. హంతకుడ్ని జ్ఞానభారతి ఠాణా పోలీసులు అరెస్టు చేశారని డీసీపీ గిరీశ్ తెలిపారు. పాల వ్యాపారం చేసే మూర్తి, ఆర్థిక లావాదేవీలను నిర్వహించే కీర్తి ఇరుగుపొరుగు నివాసులు. పితృపక్షాలు కావడంతో మూర్తి తన సోదరునితో కలిసి ఇంట్లో పూజలు చేయించుకున్నారు. ఆదివారం రాత్రి మద్యంతో భోజనాన్ని ఏర్పాటు చేశారు. ఆహ్వానించడంతో కీర్తి కూడా వచ్చాడు. ఈ సమయంలో పొరపాటున కీర్తి కాలును మూర్తి తొక్కాడు. ఇదే విషయమై గొడవ తీవ్రమైంది. తన వద్ద ఉన్న కత్తితో పొడిచి హత్య చేశాడు. హత్య అనంతరం పరారైన నిందితుడ్ని సోమవారం ఉదయం అరెస్టు చేశారు.

బళ్ళారి

• బళ్ళారి • రాయచూరు

భక్తిశ్రద్ధలతో గవాయి పుణ్య స్మరణ


కంప్లిలో పుట్టరాజ గవాయి చిత్రపటం ఊరేగింపు

కంప్లి, న్యూస్‌టుడే: పండిత పుట్టరాజ గవాయి పుణ్య స్మరణ కంప్లిలో సోమవారం భక్తిశ్రద్ధలతో జరిగింది. భజనా బృందం వెంట రాగా మంగళ వాయిద్యాలతో కోటె పంపాపతి ఆలయం నుంచి గవాయి చిత్రపటాన్ని ఊరేగించారు. పట్టణంలోని ప్రధాన వీధుల గుండా కొనసాగిన ఊరేగింపు సాంగత్యం సంస్కృత పాఠశాల వరకు సాగింది. అక్కడ విజానందప్ప గవాయి శిష్య బృందంతో సంగీత కార్యక్రమం కొనసాగింది. పండిత పుట్టరాజ గవాయి సేవా ట్రస్టు ప్రతినిధులు, స్థానిక నాయకులు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

బన్ని మహంకాళికి పూజలు

కారటగి, న్యూస్‌టుడే: పన్నాపుర కూడలిలో నూతనంగా నిర్మించిన ఆలయంలో గురువారం బన్ని మహంకాళి విగ్రహ ప్రతిష్ఠాపన జరుగనుంది. సోమవారం నుంచి ఆలయంలో పూజలు ప్రారంభమయ్యాయి. ఉదయం గంగాదేవి పూజ ఇతర ధార్మిక కార్యక్రమాలు జరిగాయి. సాయంత్రం మహిళలు పూర్ణ కుంభాలతో వెంట రాగా గ్రామ దేవత ద్యావమ్మ దేవి ఆలయం నుంచి పన్నాపుర కూడలి వరకు బన్ని మహంకాళి విగ్రహాన్ని ఊరేగించారు.


విగ్రహ ఊరేగింపులో పూర్ణ కుంభాలతో పాల్గొన్న మహిళలు

పౌష్టికాహారంతోనే రేపటి పౌరులు దృఢం


విద్యార్థికి ఉడికించిన కోడిగుడ్డు తినిపిస్తున్న ఎమ్మెల్యే బాదర్లి

సింధనూరు, న్యూస్‌టుడే: పిల్లలు ఆరోగ్యంగా ఉంటేనే చదువులు సాగుతాయి. పౌష్టికాహారం తీసుకుని విద్యార్థులు ఆరోగ్యాలు మెరుగు పర్చుకోవాలని శాసనసభ్యుడు బాదర్లి హంపనగౌడ కోరారు. అజీం ప్రేమ్‌జీ ఫౌండేషన్ సహకారంతో రాష్ట్ర ప్రభుత్వ అక్షరదాసోహ - మధ్యాహ్న భోజన పథకంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఇక వారంలో రెండు రోజులు కాకుండా ఆరు రోజులూ పౌష్టికాహారం గుడ్డు, అరటి పండు, సంగం చిక్కీ తదితర ఆహారాన్ని ఇచ్చే పథకానికి శ్రీకారం చుట్టింది. సోమవారం పీడబ్ల్యూడీ క్యాంపులోని జూనియర్ కళాశాల మైదానంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్యే ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థినీ విద్యార్థులకు ఉడికించిన కోడిగుడ్డు, అరటిపళ్లు తినిపించడం ద్వారా ప్రారంభించారు. పికార్డ్ బ్యాంకు అధ్యక్షుడు ఎం. దొడ్డబసవరాజ్, బీఈఓ వాజీద్ మజీద్, వైస్ ప్రిన్సిపల్ జి.సమత శర్మ, ఎస్‌డీఎంసీ అధ్యక్షుడు భీమరెడ్డి, అజీం ఫౌండేషన్ నళిని పాల్గొన్నారు.

చెత్తబుట్టలో.. సంపద గుట్ట

☛ నగరపాలికె ఆధ్వర్యంలో సేంద్రియ ఎరువు తయారీ ☛ విక్రయానికి సిద్ధంగా 10 టన్నులు


ఈ ప్లాస్టిక్ కంపోస్ట్ డబ్బాల్లోనే ఎరువు తయారు చేస్తారు

బళ్లారి, న్యూస్‌టుడే: బళ్లారి నగర పాలికె ఇంటింటా సేకరిస్తున్న వ్యర్థాలతో సేంద్రియ ఎరువుల తయారీకి అడుగువేసింది. సంపద సృష్టికి చర్యలు చేపట్టింది. ఓ వైపు వ్యర్థాల సేకరణ, పారిశుద్ధ్యం మెరుగుపరచడం, మరోవైపు చెత్తతో పర్యావరణహిత సేంద్రియ ఎరువులు సిద్ధం చేసి ఆదాయాన్ని ఆర్జిస్తోంది. మొదటి విడతలో 10 టన్నుల సేంద్రియ ఎరువులను సిద్ధం చేసింది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం రైతులకు విక్రయించడానికి సిద్ధంగా ఉంది. నగర పాలికెలో మొత్తం 39 వార్డులు ఉన్నాయి. నివాసాలు, వాణిజ్య దుకాణాలు, పరిశ్రమలు మొత్తం 89,863 ఉన్నాయి. రోజూ ఒక్కొక్క ఇంటి నుంచి 400 గ్రాముల వ్యర్థాలు ఉత్పత్తి అవుతున్నాయి. ఇలా నగరంలో 200 టన్నుల వ్యర్థాలు పోగు పడుతున్నాయి. ఈ వ్యర్థాలను తడి, పొడి, ప్రమాద (ప్లాస్టిక్, సిరంజీలు, ఇనుప, గాజుముక్కలు) వ్యర్థాలుగా వేర్వేరు చేస్తారు. వాటిలో తడి వ్యర్థాలతో నగర పాలికె సిబ్బంది సేంద్రియ ఎరువులు తయారు చేస్తున్నారు.

కంపోస్ట్ డబ్బాలు

బళ్లారి నగరం నల్లచెరువులోని ప్రైవేట్ బస్సు ప్రాంగణ సమీపంలో నగర పాలికె వ్యర్థాలు డంపింగ్ యార్డ్ ఉంది. అక్కడే 10 ప్లాస్టిక్ కంపోస్ట్ డబ్బాలు, నాలుగు సిమెంట్ కంపోస్ట్ డబ్బాలు ఏర్పాటు చేశారు. ఒక్కొక్కటి సామర్థ్యం 9 వేల కిలోలు, ఒక్కొక్క సిమెంట్ కంపోస్ట్ డబ్బా సామర్థ్యం 7 వేల కిలోలు చొప్పున మొత్తం సామర్థ్యం 92,800 కిలోలు.


వ్యర్థాలను పరిశీలిస్తున్న కమిషనర్ ఖలీల్‌సాబ్, ఉప కమిషనర్ అబ్దుల్ రెహిమాన్

ఇలా తయారు చేస్తారు

నగర పాలికెలో నిత్యం సేకరిస్తున్న 200 టన్నుల వ్యర్థాలతో తడి, పొడి, ప్రమాద వ్యర్థాలను వేరు చేస్తారు. వాటిలో తేమ ఉన్న అన్నం, కూరగాయలు, ఆకుకూరలు, పూలు, పండ్లు ఓ చోట చేరుస్తారు. వేరు చేసిన తడి వ్యర్థాలను పోగు చేస్తారు. మొదట కంపోస్ట్ డబ్బాలో ఇప్పటికే సిద్ధంగా ఉన్న సేంద్రియ ఎరువులను మొదట పొర (లేయర్) పరుస్తారు. దానిపై తడి వ్యర్థాలను పోస్తారు. ఇలా 9వేల కిలోలు నిండే వరకు పొరలుపొరలుగా పోస్తూ వస్తారు. పూర్తిగా నిండిన తర్వాత 20 నుంచి 30 రోజులపాటు తలుపును మూసివేస్తారు. అందులో ఉన్న నీరు బయటకు వెళ్లడానికి ప్రత్యేకంగా కుళాయిని ఏర్పాటు చేశారు. నెలరోజుల తర్వాత సిద్ధమైన సేంద్రియ ఎరువును బస్తాల్లో నింపి ప్రభుత్వ నిబంధనల ప్రకారం కిలో రూ.3 నుంచి రూ.4లకు విక్రయిస్తారు. 9వేల కిలోల కంపోస్ట్ డబ్బాలో 30 శాతం సేంద్రియ ఎరువు తయారవుతుంది. ఒక్కొక్క డబ్బా నుంచి 270 కిలోల ఉత్పత్తి అవుతుంది. ఒకసారి 25 వేల నుంచి 27 వేల కిలోల సేంద్రియ ఎరువు తయారు చేస్తున్నారు. మొదటిసారిగా 10 టన్నుల ఎరువు తయారైంది. ఈ ఎరువును బస్తాల్లో నిల్వ చేసిన గోదాములో ఉంచినట్లు నగర పాలికె అధికారి కిరణ్ తెలిపారు.


సిమెంట్‌తో తయారు చేసిన కంపోస్ట్ డబ్బా

వ్యర్థాలను వేరుచేస్తేనే మరింత మేలు



నగర పాలికెలో నిత్యం ఉత్పత్తి అవుతున్న 200 టన్నుల వ్యర్థాల్లో తడి, పొడి వేరు చేయడం కష్టమవుతుంది. ఒక్కొక్క ఇంటి నుంచి రోజూ ఉత్పత్తి అవుతున్న సుమారు 400 గ్రాముల వ్యర్థాలను వేరు చేసి, ఇంటి వద్దకు వచ్చే నగర పాలికె వాహనంలో వేస్తే తడి వ్యర్థాలను సేంద్రియ ఎరువుగా తయారు చేయడానికి అనుకూలంగా ఉంటుంది. ప్రజలు సహకరిస్తే మరింత ఎక్కువ మొత్తంలో ఎరువు తయారు చేయవచ్చు. నగర పాలికె ప్రజలకు తడి... పొడి వ్యర్థాలు వేరు చేయడంపై అవగాహన కల్పించడంతో కొన్ని కాలనీల్లో నగర పాలికె అధికారులకు సహకరిస్తున్నారు.

- కిరణ్, నగర పాలికె సెక్షన్ అధికారి


సేంద్రియ ఎరువుల బస్తాలను చూపుతున్న పాలికె అధికారులు

డీవీ గుండప్పకు నివాళి

బళ్లారి గ్రామీణ, న్యూస్‌టుడే: పత్రికారంగంలో విశేష గుర్తింపునకు పత్రికారంగ భీష్ముడు డీవీ గుండప్ప అని కర్ణాటక క్రియాశీల ఉపాధ్యాయ వేదిక జిల్లా అధ్యక్షుడు రవికుమార్ పేర్కొన్నారు. సోమవారం సంజీవరాయన కోటె ప్రభుత్వపాఠశాలలో డీవీజీ సాహిత్య జాగృతి కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి మాట్లాడారు. సాహిత్యంలో అపారజ్ఞానాన్ని సాధించిన అక్షరయోధుడిగా కీర్తినందుకున్న వ్యక్తి అని ఆయన సేవలను కొనియాడారు. విద్యార్థులకు సాహిత్య జాగృతిపై పోటీలను నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.


డీవీజీ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి, విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న రవికుమార్, ఉపాధ్యాయులు

నేడు వృద్ధుల దినోత్సవం

హొసపేటె, న్యూస్‌టుడే: తాలూకా న్యాయసేవల సమితి, న్యాయవాదుల సంఘం, జిల్లా యంత్రాంగం సంయుక్తంగా 1న నగరసభ సభాంగణలో వృద్ధుల (సీనియర్ సిటిజన్ల) దినోత్సవాన్ని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా న్యాయమూర్తి అబ్దుల్ రహీమాన్ నందగడి ప్రారంభిస్తారు. నగరసభ అధ్యక్షుడు రూపేశ్‌కుమార్ అధ్యక్షత వహిస్తారు.

అవకాశాలను అందిపుచ్చుకోండి


విద్యార్థులకు కోడిగుడ్లు ఇస్తున్న ఎమ్మెల్యే గణేశ్

కంప్లి, న్యూస్‌టుడే: విద్యార్థులు సదుపాయాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత విద్య అభ్యసించాలని స్థానిక శాసన సభ్యుడు గణేశ్ సూచించారు. స్థానిక సత్యనారాయణ పేటె ప్రభుత్వ పాఠశాల ఆవరణలో సోమవారం ఆయన విద్యార్థులకు కోడి గుడ్లు పంపిణీ చేసి మాట్లాడారు. అజీం ప్రేమ్‌జీ ఫౌండేషన్ సహకారంతో ఇక నుంచి విద్యార్థులకు వారంలో ఆరు రోజులు గుడ్లు ఇస్తారన్నారు. పిల్లల ఆరోగ్యం గురించి ఆలోచిస్తున్న అజీం ప్రేమ్‌జీ ఫౌండేషన్ సేవలను కొనియాడారు. మధ్యాహ్న భోజన పథకం జిల్లా అధికారి శివకుమార నాయక్, తహసీల్దార్ శివరాజ్, విద్యా శాఖ అధికారి సిద్ధలింగ మూర్తి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయినికి సత్కారం

కారటగి, న్యూస్‌టుడే: తాలూకాలోని ఈళిగనూరు ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయిని సంగీత కందగల్‌ను సోమవారం గ్రామస్థులు సత్కరించారు. తాలూకా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయినిగా ఎంపికైన ఆమెను గ్రామంలోని పాఠశాల ఆవరణలో సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సమాజ నిర్మాతలు ఉపాధ్యాయులు. పిల్లలకు చదువుతో పాటు సంస్కారం నేర్పి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన గురుతర బాధ్యత వారిపై ఉందన్నారు. గ్రామ పెద్దలు, పాఠశాల అభివృద్ధి సమితి సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెట్ సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎన్నిక

కంప్లి, న్యూస్‌టుడే: కంప్లి వ్యవసాయ ఉత్పన్న విక్రయ సహకార సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎన్నిక సోమవారం జరిగింది. అధ్యక్ష స్థానానికి కె. భాస్కర రెడ్డి, వి.ప్రసాదరావు నామినేషన్లు వేయగా భాస్కర రెడ్డికి 10 ఓట్లు, ప్రసాదరావుకు 5 ఓట్లు వచ్చాయి. ఉపాధ్యక్ష స్థానానికి టి.ఎం.సావిత్రి, సంగటి మారేశ్ పోటీపడగా టి.ఎం.సావిత్రికి 10, మారేశ్‌కు 5 ఓట్లు వచ్చాయి. అధ్యక్షుడిగా భాస్కర రెడ్డి, ఉపాధ్యక్షురాలిగా టి.ఎం.సావిత్రి ఎన్నికయ్యారని ఎన్నికల అధికారి దుర్గప్ప తిప్పనాళ ప్రకటించారు. సంఘం ముఖ్య కార్యనిర్వహణాధికారి కె.వీరేశ్, నిర్దేశకులు పాల్గొన్నారు.

నవంబరు 17న రాఘవేంద్ర స్వామి పారాయణం

హొసపేటె, న్యూస్‌టుడే: పట్టణంలోని బస్ డిపో వద్ద ఉన్న రాఘవేంద్ర స్వామి మఠంలో నవంబరు 17న రాఘవేంద్ర స్వాముల సహస్ర అష్టోత్తర స్తోత్ర పారాయణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని ఆ మఠం పాలకమండలి సభ్యులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మంత్రాలయ రాఘవేంద్ర మఠం సుబుధేంద్ర తీర్థులు సూచనల మేరకు ఈ ధార్మిక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. హొసపేటె, కమలాపుర, మరియమ్మనహళ్లిలో ఉన్న రాఘవేంద్ర స్వామి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నారన్నారు. ఇప్పటి నుంచే ఏర్పాట్లు చేసుకుంటున్నామని చెప్పారు. ప్రముఖులు భీమసేనాచార్, గురురాజ్‌రావ్, విజయేంద్ర దేసాయి, ప్రహ్లాద్‌ఆచార్ పాల్గొన్నారు.

పొగాకు వస్తువుల నియంత్రణకు చర్యలు


పొగాకు వస్తువుల నియంత్రణపై గోడపత్రాలను విడుదల చేస్తున్న అధికారులు

బళ్లారి, న్యూస్‌టుడే: పొగాకు వస్తువుల వినియోగంతో యువత, ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని, దీనిపై అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలని అదనపు జిల్లా అధికారి మహమ్మద్ ఝుబేర అధికారులకు సూచించారు. స్థానిక డా.రాజ్‌కుమార్ రహదారిలోని నూతన జిల్లా పాలనాధికారి కార్యాలయం సభాభవనంలో ఏర్పాటు చేసిన జిల్లా పొగాకు నియంత్రణ జిల్లా స్థాయి సమన్వయ సమావేశానికి ఏడీసీ అధ్యక్షత వహించి మాట్లాడారు. అధికారులు పొగాకు వస్తువుల నియంత్రణపై సిద్ధం చేసిన గోడపత్రాలను ఆవిష్కరించారు. పాఠశాల, కళాశాలలు, ఇతర విద్యా సంస్థలకు 100 మీటర్ల దూరం వరకు పొగాకు వస్తువులను సంపూర్ణంగా నిషేధించాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని పొగాకు వస్తువులను జప్తు చేయాలన్నారు. జనసందడి ఉండే బస్సు ప్రాంగణాలు, రైల్వే స్టేషన్, ఆసుపత్రి వద్ద గోడ పత్రాలను అతికించాలన్నారు. అదనపు జిల్లా పోలీస్ అధికారి నవీన్‌కుమార్, వైద్యులు డా.రమేష్ బాబు, డా.ఎన్.బసరెడ్డి, డా.మరియంమి, జిల్లా, తాలూకా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి మంత్రి బోసురాజు పర్యటన

మాన్వి, న్యూస్‌టుడే: రాష్ట్ర శాస్త్ర, సాంకేతిక శాఖల మంత్రి ఎన్.ఎస్. బోసురాజు మంగళ, బుధ, గురు, శుక్రవారాల్లో జిల్లాలో పర్యటించనున్నారు. ఈమేరకు మంత్రి ఆప్తకార్యదర్శి వీరభద్రప్ప హంచినాళ్ ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 10.30 గంటలకు రాయచూరు రంగ మందిరంలో నిర్వహించే విశ్వ సీనియర్ సిటిజన్స్ డే కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు సిరివార తాలూకాలో పర్యటిస్తారు. బుధవారం 10.15 గంటలకు రాయచూరులో జరిగే గాంధీ జయంతిలో పాల్గొంటారు.

సాంస్కృతిక కూడలి సింధనూరు


సింధనూరు కాంగ్రెస్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వసంతకుమార్

సింధనూరు, న్యూస్‌టుడే: సింధనూరు ఒక మినీ భారత్ వంటిది.. ఇక్కడ అనేక ప్రాంతాల వారు ఉన్నారు. భిన్న సంస్కృతులు ఇక్కడే ఉన్నాయని ప్రదేశ్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, విధానపరిషత్ సభ్యుడు వసంతకుమార్ పేర్కొన్నారు. స్థానిక పీడబ్ల్యూడీక్యాంపులోని అన్నదానేశ్వర కల్యాణ మండపంలో సోమవారం కాంగ్రెస్ తాలూకా శాఖ ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సింధనూరు దసరా ఈనెల 4న ప్రారంభమై తొమ్మిది రోజుల వేడుకలు జరుగనున్న సందర్భంగా ముందస్తు ఏర్పాట్లు కోసం కాంగ్రెస్ తమ కార్యకర్తల సమావేశాన్ని జరిపింది. కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్సీ వసంతకుమార్.. ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాలినీ రజనీశ్ వంటి వారు విచ్చేయనున్న ఈ వేడుకలు మైసూరుకు ఏమాత్రం తీసిపోని విధంగా ఆచరించేందుకు కార్యకర్తలంతా సహకరించాలని వసంతకుమార్ విజ్ఞప్తి చేశారు. అనంతరం ఎమ్మెల్యే బాదర్లి కార్యకర్తలకు పలు సూచనలు అందించారు. పార్టీ సీనియర్ నాయకులు శ్రేణిక్‌రాజ్‌శేర్, లింగరాజ్, బసవరాజ్ హిరేగౌడ, ఎన్.అమరేశ్, లలితా చుండూరి, ద్రాక్షాయణి, బసమ్మ, రామనగౌడ పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల సేవలను వెలకట్టలేం

హొసపేటె, న్యూస్‌టుడే: ఒక్క రోజు పారిశుద్ధ్య కార్మికులు వీధుల్లోకి రాకపోతే, ప్రజలెవరూ నెమ్మదిగా సంచరించే పరిస్థితులు ఉండవు. తమ ఆరోగ్యాన్ని లెక్క చేయకుండా పట్టణ స్వచ్ఛతకు పాల్పడుతున్న పారిశుద్ధ్య కార్మికుల సేవలను వెలకట్టలేమని మాజీ మంత్రి హెచ్.ఆంజనేయ అభివర్ణించారు. పారిశుద్ధ్య కార్మికుల సంఘం, నగరసభ సంయుక్తంగా సోమవారం ఇక్కడ ఏర్పాటు చేసిన పారిశుద్ధ్య కార్మికుల దినోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో దాదాపు అన్ని స్థానిక సంస్థల్లో పారిశుద్ధ్య కార్మికుల సంఖ్య జనాభాకు అనుగుణంగా లేదు. ఈ నేపథ్యంలో ఉన్న కార్మికులపైనే పని ఒత్తిడి పెరిగిందని విచారం వ్యక్తం చేశారు. అయినప్పటికీ ఎలాంటి అక్కసు లేకుండా తెల్లవారుతుండగానే పట్టణం, వీధులను శుభ్రం చేస్తున్నారని కొనియాడారు. ఇళ్ల వద్దకు వచ్చే వారిని ప్రజలు గౌరవంగా చూడాలని హితవు పలికారు. కరోనా సమయంలో ప్రాణాలు లెక్కచేయకుండా విధులను నిర్వహించిన ఘనత పారిశుద్ధ్య కార్మికులకు దక్కుతుందని అన్నారు. జిల్లా పాలనాధికారి ఎం.ఎస్.దివాకర్ మాట్లాడుతూ.. జిల్లా పరిధిలోని 8 స్థానిక సంస్థల్లో ఉన్న పౌర కార్మికులకు తగిన సౌకర్యాలు అందిస్తున్నామని తెలిపారు. ఉత్తమ సేవలందిస్తున్న కార్మికులను సన్మానించారు. జిల్లా ప్రణాళిక సంచాలకుడు మనోహర్, నగరసభ అధ్యక్ష, ఉపాధ్యక్షుడు రూపేశ్‌కుమార్, రమేశ్‌గుప్తా, కమిషనర్ సి. చంద్రప్ప సంఘం ప్రముఖులు పాల్గొన్నారు.


ఉత్తమ సేవలందిస్తున్న పారిశుద్ధ్య కార్మికులను సన్మానిస్తున్న మాజీ మంత్రి ఆంజనేయ, పాలనాధికారి, నిర్వాహకులు

యువకులే దేశ భవిష్యత్తు


అంబేడ్కర్ చిత్రపటానికి పుష్పార్చన చేయడంతో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ప్రముఖులు

హొసపేటె, న్యూస్‌టుడే: నేటి యువకుల్లో సంఘటన పటిమ చాలా అవసరమని స్లం జనాందోళన కర్ణాటక రాష్ట్ర సంచాలకుడు ఎ.నరసింహ మూర్తి పేర్కొన్నారు. సావిత్రిబాయి ఫులె మహిళా సంఘటన, స్లం జనాందోళన సంఘటనలు సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం జయప్రకాశ్ నారాయణ్ భవన్‌లో ఏర్పాటు చేసిన యువ, మహిళ నాయకత్వం శిబిరం, అసంఘటిత కార్మికులకు చట్టాలపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. యువకులే జాతీయ భవిష్యత్తు, వారిని సన్మార్గంలో నడిపించే నాయకత్వం అవసరం చాలా ఉందని తెలిపారు. దేశ జనాభాలో అధిక శాతం మంది యువకులు ఉన్నారు. ఏలికలు వారిని ఓటు బ్యాంకుగా వినియోగించుకుని తరువాత విదుల్చుకుంటున్నారని విచారం వ్యక్తం చేశారు. సంఘంలో నెలకొన్న అంధ విశ్వాసాలను పారదోలే బాధ్యత యువకులపై ఉందని గుర్తు చేశారు. బాల్యవివాహాలు, బాల కార్మిక పద్ధతి నిర్మూలనకు ప్రభుత్వంతో చేతులు జోడించాలని తెలిపారు. స్లం జనాందోళన ప్రముఖులు ఇమ్తియాజ్ మానవి, జనార్దన్ హాళిబెంచి, వెంకమ్మ పాల్గొన్నారు.

పంచాయతీ సమస్యలపై 4న చలో బెంగళూరు


మాట్లాడుతున్న ఒక్కూట జిల్లా అధ్యక్షులు బణాపుర నాగరాజగౌడ, చిత్రంలో సభ్యులు

బళ్లారి, న్యూస్‌టుడే: వేతనాలు పెంచడంతో పాటు ఇతర డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్, డేటా ఆపరేటర్ సంఘం, కర్ణాటక గ్రామ పంచాయతీ మహా ఒక్కూట సంయుక్త ఆధ్వర్యంలో బెంగళూరు స్వాతంత్ర్య ఉద్యానవనంలో నిరవధిక సత్యాగ్రహానికి ఈ నెల 4న చలో బెంగళూరు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు బణాపుర నాగరాజగౌడ వెల్లడించారు. సోమవారం నగరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ డిమాండ్లు పరిష్కరించాలని పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడంతో రాష్ట్ర అధ్యక్షుడి ఆదేశాలతో ఈ నెల 4నుంచి నిరవధిక సత్యాగ్రహం చేస్తున్నట్లు చెప్పారు. గ్రామ పంచాయతీకే స్వేచ్ఛ అధికారం కల్పించాలి, ఐఏఎస్ అధికారులు జోక్యం ఉండకూడదన్నారు. గ్రామ పంచాయతీలో జరిగే కార్యక్రమాలు అధ్యక్షుడి అధ్యక్షతనే నిర్వహించాలి. ఉన్నత అధికారుల ఒత్తిడితో రాష్ట్ర వ్యాప్తంగా 21 మంది పీడీవోలు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో 4 నుంచి గ్రామ పంచాయతీ అధికారులు విధులు బహిష్కరించి ఆందోళనలో పాల్గొంటారని వివరించారు. సభ్యులు పంపయ్య, హుసేన్, పీర, దాదాసాహెబ్, శ్రీధర, శాసవలి, పంపయ్య, హుసేన్, మర్రిస్వామి, పూజారి రామాలి పాల్గొన్నారు.

మహారాష్ట్రలో కన్నడ రాజ్యోత్సవం

కారటగి, న్యూస్‌టుడే: కర్ణాటక 50వ సంభ్రమాన్ని పురస్కరించుకుని పొరుగు రాష్ట్రం మహారాష్ట్రలోని జత్ తాలూకా గుడ్డాపుర గ్రామంలో సోమవారం హొరనాడు కన్నడిగర సమావేశం నిర్వహించారు. అక్కడి కన్నడ మాధ్యమ విద్యార్థులకు నలి- కలి సామగ్రి అందించారు. పలువురికి గడినాడు చేతన పురస్కారాలను ప్రదానం చేశారు. కన్నడ, సంస్కృతి శాఖ, గడి అభివృద్ధి ప్రాధికార ఈ కార్యక్రమం నిర్వహించింది. కన్నడ, సంస్కృతి శాఖ మంత్రి శివరాజ్ తంగడగి, జౌళి, కృషి మార్కెట్ శాఖ మంత్రి శివానంద పాటిల్, జిల్లా పాలనాధికారి టి.బూబాలన్, ముఖ్యకార్య నిర్వహణాధికారి రిషి ఆనంద్, గుడ్డాపుర దానమ్మ దేవి ట్రస్టు అధ్యక్షుడు విజుగౌడ పాటిల్, గడి అభివృద్ధి ప్రాధికార కార్యదర్శి ప్రకాశ్ మత్తిహళ్లి పాల్గొన్నారు.

సింధనూరు బంద్‌కు ఐక్య పోరాట సమితి పిలుపు

సింధనూరు, న్యూస్‌టుడే: ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ ఉప వర్గీకరణలో ఎన్నికలకు ముందు ఒకమాట..అనంతరం మరోమాట మాట్లాడుతున్న రాష్ట్ర ప్రభుత్వ తీరును ఖండిస్తూ ఈనెల 3న సింధనూరు బంద్ పాటిస్తున్నామని సింధనూరు ఉప వర్గీకరణ (ఒళ మీసలాతి) ఐక్య పోరాట సమితి ప్రకటించింది. ఈ మేరకు సోమవారం నాయకులు విలేకరులతో మాట్లాడారు. గ్యారంటీ రామయ్యగా పేరొందిన ముఖ్యమంత్రి సిద్ధరామయ్య న్యాయమూర్తి సదాశివ కమిషన్ అమలు చేయడంలో మీనమేషాలు లెక్కించడం శోచనీయమని దుయ్యబట్టారు. కమిషన్ ఏర్పాటుకు పదేళ్లు, ఏర్పడిన కమిషన్ తన పని ప్రారంభించడానికి ఇంకో పదేళ్లు, సిద్ధం చేసిన నివేదికను సమర్పించడానికి మరో పదేళ్లు ఇలా 30 ఏళ్లుగా మా పోరాటానికి కళ్లు కాయలుకాచేలా ఎదురుచూసినా ఫలితం దక్కడం లేదని నాగరాజపూజార్, బోస్వంచర్, మరియప్ప, యమునప్ప తెలిపారు. తమ హక్కులను కాపాడుకోవడానికి బంద్‌కు పిలుపునిచ్చినట్లు ప్రకటించారు.


బంద్‌కు మద్దతు పలుకుతున్న దళిత సంఘాల నాయకులు


తుంగభద్ర జలాశయం నీటిమట్టం

పూర్తిస్థాయి నీటిమట్టం 1633 అడుగులు

30-09-2024 (ఉ॥ 8 గంటలకు)	ప్రస్తుతం	గత సంవత్సరం
నీటిమట్టం (అడుగుల్లో)	1632.00	1618.23
ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	10,633	1419
అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	10,153	9,739
నీటి నిల్వ (టి.ఎం.సి)	101.773	56,505

గరిష్ఠసామర్థ్యం (133 టీఎంసీలు) వాస్తవసామర్థ్యం 105.788 టీఎంసీలు

3 నుంచి దేవి నవరాత్రి ఉత్సవాలు


సాలుంచిమర క్యాంపులోని మారెమ్మ దేవి

సాలుంచిమర క్యాంపు (కారటగి), న్యూస్‌టుడే: తాలూకాలోని సాలుంచిమర క్యాంపు మారెమ్మ దేవి ఆలయంలో ఈ నెల 3 నుంచి దేవి నవరాత్రి ఉత్సవాలు జరగనున్నాయి. తొలిరోజు పాడ్యమి నాడు ఆలయంలో కలశ స్థాపనతో ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఆరోజు దేవి బాలత్రిపుర సుందరీ దేవిగా భక్తులకు దర్శనమివ్వనున్నారు. విజయ దశమి వరకు రోజూ దేవి వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిస్తారని ఆలయ సమితి ప్రతినిధులు తెలిపారు.

బతికుండగానే.. శిశువును పూడ్చేశారు

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే : ఆనేకల్ తాలూకా కత్రిగుప్పె దిణ్ణె గ్రామంలో నవజాత శిశువును కన్నవారే దిబ్బలో సగం పూడ్చి వెళ్లారు. స్థానిక మహిళ ఒకరు బహిర్భూమికి వెళ్లిన సమయంలో ఏడుపు వినిపించడంతో ఒక మహిళ అక్కడ చూడగా దిబ్బలో ఒక బిడ్డ కనిపించింది. ఆ మగ బిడ్డను రక్షించిన బాలల రక్షణ మండలి అధికారి హెచ్‌కే ఆశకు అప్పగించింది. నవజాత శిశువు ఒంటిపై గాయాలు ఉండడంతో దొమ్మసంద్ర ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించి, చికిత్స ఇప్పిస్తున్నారు. సర్జాపుర ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఆర్టీసీ బస్సు బోల్తా

మండ్య, న్యూస్‌టుడే : బెంగళూరు-మైసూరు జాతీయ రహదారిలో మండ్య సమీపంలో సర్వీసు రోడ్డులో వెళుతున్న కేఎస్ఆర్టీసీ బస్సు సోమవారం ఉదయం బోల్తా కొట్టింది. ఒక గుంతను, పక్కనే వెళుతున్న ద్విచక్ర వాహనదారుడిని ఢీకొట్టకుండా తప్పించే ప్రయత్నంలో బస్సు బోల్తా కొట్టింది. ప్రమాదం సంభవించిన సమయంలో బస్సులో పాతిక మందికి పైగా ప్రయాణికులు ఉన్నారు. వారిలో 20 మంది గాయపడటంతో సమీపంలోని వైద్యశాలకు తరలించారు. బాధితులను బస్సు నుంచి బయటకు తీసేందుకు స్థానికులు సహకరించారు. చిన్నపాటి గాయాలైన బాధితులు స్థానిక ఆసుపత్రిలో చికిత్స చేయించుకుని ఇళ్లకు తిరిగి వెళ్లారు. మండ్య గ్రామీణ ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఆకాశగంగకు దోసిలిపడితే పులకింత!

'బెంగళూరు' భవితకు అదే శ్రీరామరక్ష



శివార్లలో వాననీటి సంరక్షణకు చర్యలు

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : నదులు, వాగులు లేని సముద్రమట్టానికి 12 వందల మీటర్ల ఎత్తులో ఉన్న బెంగళూరు నగరంలో వాననీటి సంరక్షణే శ్రీరామరక్ష. ఆ అంశాన్ని విస్మరిస్తే జలక్షామం తప్పదని అంతర్జాతీయ నీటి సంరక్షణ పరిశోధన సంస్థ హెచ్చరించాక కూడా పాలకుల్లో స్పందన కరవు. ఇప్పటి నుంచే ఈ చర్యలు చేపట్టకపోతే భవిష్యత్తులో ప్రజలు నానా అగచాట్లూ చవిచూడక తప్పదని లండన్‌కు చెందిన ఆ సంస్థ ఐదేళ్ల కిందట హెచ్చరించిన విషయం తెలిసిందే.



చెరువుల సంరక్షణకు పెద్దపీట



మురుగునీటి శుద్ధీకరణ విధానాల విస్తరణ

ఆ హెచ్చరికలను పాలకులు పట్టించుకోలేదు. దాని ఫలితం వర్షాంకాలంలోనూ నగరవాసులు అనుభవిస్తున్నారు. వాననీటికి దోసిలి పడితే.. అనేక సమస్యల నుంచి గట్టెక్కవచ్చని నగరంలోనే విస్తరించిన భారతీయ విజ్ఞాన సంస్థ (ఐఐఎస్‌సీ) పదేపదే హెచ్చరిస్తోంది. నదులు, వాగులు లేని బెంగళూరు నగరం పూర్తిగా వాననీటిపై ఆధారపడాలి. వంద కిలోమీటర్ల దూరం నుంచి నిత్యం 1450 ఎంఎల్‌డీ 'కావేరి' నదీజాలలను సరఫరా చేస్తున్నారు. అంతకు పూర్వం నగరవాసులు భూగర్భజలాలపై ఆధారపడేవారు. పూర్వపు రాజు- నగర నిర్మాత కెంపేగౌడ వాననీటి సంరక్షణ కోసం చెరువులు విస్తారంగా తవ్వించారు. ఆనాటి నుంచి వాననీటిని ఒడిసి పట్టుకున్న చెరువులే నగరాన్ని ఆదుకున్నాయి. భూగర్భ జలాల మట్టం పెరిగి బావులు కళకళలాడేవి. కాలక్రమంలో కెంపేగౌడ తవ్వించిన వెయ్యికిపైగా చెరువులు కనమరుగై ప్రస్తుతం 86కు కుదించుకుపోయాయి. అవీ ఎప్పుడు మాయమవుతాయో తెలియని దుస్థితి. ప్రస్తుతానికి కావేరి నీటిని తరలించుకొస్తున్నా.. అదెంతో వ్యయప్రయాసలమయం. ఇప్పటికైనా వాననీటి సంరక్షణ మరోసారి ప్రారంభించి కొనసాగిస్తూ భూగర్భజలాల మట్టం పెరుగుతుందని జల నీటి నిపుణుడు డాక్టర్ శివకుమార్ 'న్యూస్‌టుడే'కి వివరించారు. నగరానికి చేరువలోని తిప్పగుండనహళ్లి, హెసరుఘట్ట, బెళ్లందూరు, వర్తూరు, యలహంక తదితర చెరువులను సిద్ధం చేస్తే తాగునీటి ఎద్దడి నివారించవచ్చు. కావేరి నీరు సరఫరా కాకముందు సగం బెంగళూరుకు తిప్పగుండనహళ్లి, హెసరుఘట్ట చెరువులు దాహం తీర్చడం ప్రస్తావనార్హం. భవనాలకు అనుబంధంగా ఆకాశగంగకు చోటిచ్చే నిర్మాణాలు చేపడితే సగం సమస్య అదుపులోకి వస్తుందన్నారు. తప్పనిసరిగా వాననీటి సంరక్షణ చర్యలు చేపట్టాలనే చట్టం తెచ్చిన క్రమంలో అధికారులు సక్రమంగా నిబంధనలు అమలు చేయాలనే డిమాండు తెరపైకి వచ్చింది.



ఓ ఉద్యానవనంలో ఇంకుడు గుంత

కాలు తొక్కాడని కత్తితో పొడిచి చంపాడు

బెంగళూరు (సదాశివనగర), న్యూస్‌టుడే : తన కాలు తొక్కాడన్న కోపంతో మూర్తి (52) అనే పాల వ్యాపారిని కీర్తి (27) అనే యువకుడు హత్య చేశాడు. హంతకుడ్ని జ్ఞానభారతి ఠాణా పోలీసులు అరెస్టు చేశారని డీసీపీ గిరీశ్ తెలిపారు. పాల వ్యాపారం చేసే మూర్తి, ఆర్థిక లావాదేవీలను నిర్వహించే కీర్తి ఇరుగుపొరుగు నివాసులు. పితృపక్షాలు కావడంతో మూర్తి తన సోదరునితో కలిసి ఇంట్లో పూజలు చేయించుకున్నారు. ఆదివారం రాత్రి మద్యంతో భోజనాన్ని ఏర్పాటు చేశారు. ఆహ్వానించడంతో కీర్తి కూడా వచ్చాడు. ఈ సమయంలో పొరపాటున కీర్తి కాలును మూర్తి తొక్కాడు. ఇదే విషయమై గొడవ తీవ్రమైంది. తన వద్ద ఉన్న కత్తితో పొడిచి హత్య చేశాడు. హత్య అనంతరం పరారైన నిందితుడ్ని సోమవారం ఉదయం అరెస్టు చేశారు.

అన్నదాత నీటిపాలు

కలబురగి, న్యూస్‌టుడే : హునగుంద తాలూకా మూగనూరులో ఆదివారం రాత్రి బైకులో ఇంటికి వెళుతున్న సమయంలో వాగులోకి పడిపోయి శివప్ప బసవనళ (38) అనే రైతు మరణించారు. భారీ వర్షంలో వంతెనపైకి నీరు రావడంతో అతను నీటిలో పడిపోయాడని గుర్తించారు. సోమవారం ఉదయం అతని మృతదేహాన్ని వెలికి తీశారు. అమీనగడ ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.



రాచనగరికి దీపతోరణాలు!



రాచనగరి.. మైసూరు దసరా సంబరాలకు సమయం సమీపిస్తోంది. దేశ, విదేశీ పర్యాటకులను ఆకట్టుకోవడానికి నగరాన్ని సర్వాంగసుందరంగా తీర్చిదిద్దుతున్నారు. అన్ని వీధులు, కూడళ్లను ప్రత్యేకంగా అలంకరించారు. ప్రతి వాడా విద్యుద్దీపకాంతులతో మిరమిట్లు గొలుపుతోంది. ఒక్కో ప్రాంతాన్ని ఒక్కో రకంగా ఆవిష్కరిస్తున్నారు. శ్రీరంగపట్టణం వైపు నుంచి నగరంలోకి ప్రవేశించే మార్గంలో కనిపించే విద్యుల్లతల అందాలివీ!

-న్యూస్‌టుడే, మైసూరు

మెట్రో.. మహాసేవల హారం!

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : ఆసియాలో అతి ఎత్తైన మెట్రో ప్రయాణ ప్రాంగణం బెంగళూరు నగరంలోని 'జయనగర'లో ఈ ఏడాది ఆఖరిలో ప్రారంభం కానుంది. ఆ ప్రాంగణం మీదుగా చోదకుడులేని మెట్రో రైలు ప్రయోగాత్మకంగా పరుగులు తీస్తోంది. ఆరు విభాగాలుగా విరాజిల్లే ప్రాంగణం రహదారి కన్నా 29 మీటర్ల ఎత్తులో విస్తరించింది. దీని నిర్మాణానికి రూ.200 కోట్లు వ్యయం చేశారు.



ఆర్.వి.రోడ్డు- బొమ్మనహళ్లి మార్గంలో చోదకుడి అవసరంలేని మెట్రో



ఆర్.వి.రోడ్డు ఉపరితల మెట్రోస్టేషన్

ఆర్‌వీ రహదారి- బొమ్మనహళ్లి మధ్య దూరం 18.9 కిలోమీటర్లు. ఈ పరిధిలోనే 'జయదేవ' మెట్రో రూపుదాల్చింది. ఈ మార్గం మొదటి దశలో డెయిరీ కూడలి నుంచి బన్నేరుఘట్ట వరకు భూగర్భ అండర్‌పాస్ మార్గాన్ని ఒదిగిపోయేలా చేశారు. రెండో దశలో రాగిగుడ్డ- సెంట్రల్ సిల్క్‌బోర్డు వరకు సాగే రహదారి, మూడు దశ డబుల్ డెక్కర్ దారి, నాలుగో అంతస్తుగా.. జయదేవ ఆసుపత్రి కూడలి నుంచి సెంట్రల్ సీల్క్ బోర్డు వరకు ఎలివేటెడ్ మార్గం, ఐదో అంతస్తు.. గూట్టిగెరె- నాగవార మెట్రో మార్గం, చివరి ఆరో దశలో ఆర్.వి. రోడ్డు- బొమ్మసంద్ర రైలుమార్గం! ఈ మహా కూడలి (జంక్షన్) ఇకపై నిత్యం లెక్కలేనన్ని నాజూకు రైళ్లతో హోరెత్తనుంది. ప్రస్తుతానికి.. చోదకుడిలేని మెట్రో నమూనా పరుగు, డబుల్ డెక్కర్ మార్గంపై వాహనాలు సంచరిస్తున్నాయి. భవిష్యత్తులో ప్రతి 15 నిమిషాలకు ఎనిమిది మెట్రో రైళ్ల రాకపోకలు సాగిస్తాయని బీఎంఆర్‌సీఎల్ అధికార ప్రతినిధి యశ్వంత్ చౌహన్ తెలిపారు. ఏడాది ఆఖరిలోగా డ్రైవర్ రహిత మెట్రో రైలు ప్రజావసరాలు తీరుస్తుందని తెలిపారు.



అతి ఎత్తైన ప్రాంతంలో విస్తరించిన జయదేవ ఆసుపత్రి కూడలిలో ప్రయాణ ప్రాంగణం



ఐటీ నడవా గుండా మెట్రో మార్గం సేవలు

పంటల రక్షణకు పరిశోధనలు

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : వివిధ ప్రాంతాల్లో ఉద్యానవన పంటల అభివృద్ధి కోసం ఎక్కువ పరిశోధనలు సాగించాలని భారతీయ ఉద్యానవనాల పరిశోధన సంస్థ(దిల్లీ) ఉప సంచాలకుడు డాక్టర్ సంజయ్‌కుమార్‌సింగ్ పిలుపునిచ్చారు. స్థానిక హెసరుఘట్ట భారతీయ ఉద్యానవనాల పరిశోధన సంస్థ ఆవరణలో జాతీయ స్థాయిలో మొక్కల పరిశోధనలపై సోమవారం ఏర్పాటు చేసిన సెమినార్‌లో ఆయన మాట్లాడారు. పంటలకు శత్రువులైన కీటకాలను నిర్మూలించాల్సిన అవసరాన్ని గుర్తుచేశారు. మేలు చేసే కీటకాలను మినహా మిగతా వాటి నిర్మూలన ముఖ్యమనే విషయం ప్రస్తావించారు. అధ్యాపకులు, విద్యార్థులు శత్రు కీటకాల నిర్మూలనపై పరిశోధనలు సాగించాలని పిలుపునిచ్చారు. ఈసందర్భంగా సంస్థలో ప్రతిభ చూపించిన శాస్త్రవేత్తలకు పురస్కారాలను ప్రదానం చేశారు. ఐఐహెచ్‌ఆర్ డైరెక్టర్ డాక్టర్ తుషార్ కాంతి బేహరాతో పాటు ఏడుగురు విదేశీ ప్రతినిధులు 22 రాష్ట్రాలకు చెందిన 263 ప్రతినిధులు హాజరయ్యారు.



శాస్త్రవేత్తకు పురస్కారం అందిస్తున్న డాక్టర్ సంజయ్‌కుమార్‌సింగ్, డాక్టర్ తుషార్ కాంతి బేహరా తదితరులు

'వాల్మీకి' మండలిలో అక్రమాలు హైకోర్టులో తీర్పు రిజర్వు

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే : మహర్షి వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్‌లో జరిగిన అక్రమాలకు సంబంధించి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రతినిధులు వేసుకున్న వేసుకున్న అర్జీపై విచారణను ఉన్నత న్యాయస్థానం పూర్తి చేసింది. తీర్పును అక్టోబరు 14 లేదా 15న ప్రకటిస్తానని జస్టిస్ ఎం. నాగప్రసన్న తెలిపారు. కార్పొరేషన్‌కు చెందిన నగదును యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్వారా రూ.51 కోట్లను ఇతర ఖాతాలకు బదిలీ చేశారు. ప్రభుత్వం తరపున సీనియరు న్యాయవాది బీవీ ఆచార్య వాదనలు వినిపించారు.

మధుబని చిత్రాల ప్రదర్శన

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : బిహారులోని మిథిల ప్రాంతంలో ప్రాణం పోసుకున్న 'మధుబని' చిత్రకళకు దేశ, విదేశాల్లో చక్కని గుర్తింపు ఉంది. జానపదాలను ఇతివృత్తంగా గీచిన ఈ చిత్రాలను బెంగళూరు ఇందిరానగరలోని 'ఆట- గలాట' ప్రాంగణంలో ప్రదర్శిస్తున్నారు. చక్కని ఈ చిత్రాలను ఆసక్తి ఉన్న వారు కొనుగోలు చేసుకునేందుకు అవకాశం కల్పిస్తున్నామని నిర్వాహకులు సోమవారం ఇక్కడ తెలిపారు.



చూసినంతనే.. ఆకట్టుకునే ఏనుగు బొమ్మ



బెంగళూరు విపణిలో పండ్లు, కూరగాయల ధరలు

(హాప్‌కామ్స్– కిలో..రూ.లలో)

● బీన్స్-	55
● క్యారెట్-	65
● బీరకాయలు-	40
● క్యాబేజి-	20
● కాలీఫ్లవర్ (ఒక్కోటి)-	25
● సొరకాయ-	35
● దొండకాయలు-	40
● పొట్లకాయ-	35
● టమాటా(నాటు)-	48
● టమాటా(సాధారణ)-	42
● గుమ్మడి-	40
● ఆలుగడ్డ-	40
● ఉల్లిగడ్డలు(మేలురకం)-	70
● ఉల్లిగడ్డలు(సాధారణ)-	50
● వెల్లుల్లి-	390
● సాంబారు ఉల్లి-	95
● బీట్‌రూట్-	25
● వంకాయలు-	35
● బెండకాయలు-	40
● ముల్లంగి-	40
● నిమ్మకాయ-	200
● వాషింగ్టన్ ఆపిల్:	305
● సిమ్లా ఆపిల్-	140
● గ్రీన్ ఆపిల్-	320
● అరటి కాయలు-	45
● సపోటా-	55
● పైనాపిల్-	38
● బొప్పాయి-	44
● ఆరంజి-	60
● బత్తాయి-	55

(న్యూస్‌టుడే, యశ్వంతపుర)

అక్షయపాత్రకు కొత్త వంటశాల



ప్రారంభ కార్యక్రమంలో ఇన్ఫోసిస్ నారాయణమూర్తి, కృష్ణ బైరేగౌడ తదితరులు

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : విద్యార్థులకు మధ్యాహ్నం పౌష్టికాహారాన్ని అందించేందుకు ఇస్కాన్ సంస్థ తన 'అక్షయ పాత్ర' వంట కేంద్రాన్ని చిక్కజాలలో ఏర్పాటు చేసింది. ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుడు ఎన్.ఆర్. నారాయణమూర్తితో కలిసి మంత్రి కృష్ణ బైరేగౌడ సోమవారం ఈ కేంద్రాన్ని ప్రారంభించారు. చిక్కజాల, యలహంక చుట్టుపక్కల ప్రాంతాల్లోని 200 పాఠశాలలకు చెందిన 35 వేల మంది విద్యార్థులకు ఇక్కడ వంట తయారు చేస్తామని ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మధు పండిత్ దాస తెలిపారు. ఇది దేశంలో తమ 75వ అత్యాధునిక సదుపాయాలున్న వంట తయారీ కేంద్రమని చెప్పారు. ఠక్కర్ ఫ్యామిలీ సహకారంతో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు.



అక్షయ పాత్ర వంట తయారీ కేంద్రం

మాతృభాషలో అనువాద రచనలు పెరగాలి

హొసపేటె, న్యూస్‌టుడే: ఇతర భాషల ఉత్తమ రచనలు, పుస్తకాలను కన్నడ భాషలోకి అనువాదం చేయాల్సిన అవసరం ఉందని గంగావతి ప్రభుత్వ కళాశాల సహ ప్రాధ్యాపకుడు డాక్టర్ జాజి దేవేంద్రప్ప పేర్కొన్నారు. హంపీ వర్సిటీలో సోమవారం ఏర్పాటు చేసిన అనువాద దినోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కన్నడ భాష పుస్తకాలను ఇతర భాషల్లోకి తర్జుమా చేయడంతో, ఇక్కడి భాషా సంపదను వేరే రాష్ట్రాలకు పరిచయం చేసినట్లవుతుందని పేర్కొన్నారు. అనువాదం అంత సులభమైన పనికాదు. చిన్న పుస్తకాన్ని కూడా అనువాదం చేయాలన్న పలు జాగ్రత్తలు పాటించాలని హెచ్చరించారు. లేనిపక్షంలో అవాంతరాలు జరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. అనువాదం చేయాలంటే భాషపై పట్టు చాలా అవసరమని నొక్కిపలికారు. అధ్యక్షత వహించిన వర్సిటీ ఉపకులపతి డాక్టర్ డి.వి. పరమశివమూర్తి మాట్లాడుతూ వర్సిటీలో తర్జుమా విభాగం క్రియాశీలంగా పనిచేస్తోందని తెలిపారు. భాషాంతర అధ్యయన విభాగం ముఖ్యుడు డాక్టర్ మోహన్‌కుంటార్ పాల్గొన్నారు.



వర్సిటీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతున్న సహ ప్రాధ్యాపకుడు డాక్టర్ జాజి దేవేంద్రప్ప

మీ వెంటే నేనూ

గుండెపోటుతో దంపతుల మృతి



ఓంకారమూర్తి, దాక్షాయణమ్మ

చిత్రదుర్గం, న్యూస్‌టుడే: ఒకరికి ఒకరు తోడుగా నూరేళ్లు కలిసి ఉంటామని పెళ్లి రోజున చేసుకున్న బాసలు గుర్తొచ్చాయో ఏమో... తన భర్తకు గుండెపోటు వచ్చిందన్న సమాచారంతో భార్య హృదయ స్పందన ఆగిపోయింది. మీ వెంటే నేనూ అంటూ ఆయనకు తోడుగా వెళ్లిపోయిన విషాదంతం ఇది. మృతుల బంధువుల తెలిపిన వివరాల ప్రకారం... చిత్రదుర్గం పట్టణంలోని ఎస్‌జెఎం కళాశాలలో ఓంకారమూర్తి(67) అనే వ్యక్తి గ్రంథాలయ అధికారిగా పని చేసి భార్య దాక్షాయణమ్మ(59)తో కలిసి విశ్రాంత జీవనం సాగిస్తున్నారు. సోమవారం ఓంకారమూర్తికి గుండెపోటు వచ్చింది. కుటుంబ సభ్యులు ఆయనను చికిత్స నిమిత్తం ఇక్కడి శ్రీబసవేశ్వర మెడికల్ కళాశాల ఆసుపత్రిలో చేర్పించారు. ఇంట్లో ఉన్న భార్య దాక్షాయణమ్మకు ఈ విషయం తెలిసిన వెంటనే గుండెపోటుతో కుప్పకూలి చివరి శ్వాస వదిలారు. అటు ఆసుపత్రిలో కొద్దిసేపటికి ఆయనా మృత్యువాత పడ్డారు. దాదాపు 35 ఏళ్ల వారి అన్యోన్య దాంపత్యం ముగిసింది. భార్యాభర్తలు మృత్యువులోనూ ఒకరిని వీడి మరొకరు ఉండలేపోయారని అక్కడి వారు కంటతడి పెడుతూ కనిపించారు. దంపతులకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, సహోద్యోగుల కన్నీటి మధ్య అంత్యక్రియలు ముగిశాయి.

భార్య మృతితో భర్త బలవన్మరణం..

రామకుప్పం, న్యూస్‌టుడే: భార్య అనారోగ్యంతో మృతి చెందిందని భర్త బలవన్మరణంతో మృతి చెందిన సంఘటన సోమవారం ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు జిల్లా రామకుప్పం మండలంలోని రాజుపేట వద్ద విషాదం నింపింది. కుప్పం గ్రామీణ సీఐ మల్లేష్ యాదవ్ వివరాల మేరకు... కర్ణాటక రాష్ట్రం కోలారు జిల్లా బాలువనహళ్లి గ్రామానికి చెందిన గంగప్ప(89) భార్య లక్ష్మమ్మ అనారోగ్యంతో రెండు నెలల కిందట మృతి చెందింది. ఆదివారం సాయంత్రం నుంచి గంగప్ప కనబడక పోవడంతో కుటుంబసభ్యులు బంధువులు, ఇతర ప్రాంతాల్లో వెతికినా ఫలితంలేకపోయింది. భార్య మరణించిందని మనస్తాపంతో గంగప్ప రామకుప్పం మండలం రాజుపేట గ్రామ సమీపంలో చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు సీఐ వివరించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతునికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

బీదర్‌లో చోరుల ఆటకట్టు.. బైకులు, ఆభరణాల స్వాధీనం

బీదర్, న్యూస్‌టుడే : ఇళ్ల ముందు, పార్కింగ్‌లో నిలిపి ఉంచిన ద్విచక్రవాహనాలు దొంగిలిస్తున్న పాతిక మంది నిందితులను అరెస్టు చేశారు. వారి నుంచి రూ.43 లక్షల విలువైన బైకులు, ఆభరణాలను జప్తు చేసుకున్నారు. బీదర్ పరిధిలోని తొమ్మిది ఠాణాల్లో 20 దొంగతనాల కేసును పరిష్కరించామని పోలీసులు తెలిపారు. జప్తు చేసుకున్న సొత్తులో రూ.35 లక్షల విలువైన బైకులు ఉన్నాయి.

విద్యుత్తు కారు విడుదల

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : మాగడి రోడ్డులోని ఓ షోరూమ్‌లో విండ్సర్ విద్యుత్తు కారును 'కాంతార' ఫేం నటీమణి సప్తమీగౌడ విడుదల చేశారు. ఎంజీ మోటార్స్ దేశంలోని మెట్రో నగరాల్లో ఈ కారును విడుదల చేస్తున్న విషయాన్ని సంస్థ యాజమాన్య ప్రతినిధి నుపుర్ జైన్ గుర్తుచేశారు. విద్యుత్తు కార్లకు ఉన్న డిమాండ్, వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా తమ వాహనాల డిజైన్ ఉందని ఆమె చెప్పారు. అర్థా కార్స్ సీఈఓ ఛేజైన్, మానవ వనరుల అధికారి నాగశ్రీ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



కారు వద్ద నటి సప్తమీ గౌడ, సంస్థ ప్రతినిధులు

బెంగళూరు
• బెంగళూరు • హోసూరు

కొత్వాలు ఆటోల వితరణ



ఆటోలో అధికారితో కలిసి కొత్వాలు ప్రయాణం

బెంగళూరు (శివాజీనగర): నగర పోలీసు, పరిహారం సంస్థ, యునైటెడ్ వే, ఎన్‌టీటీ డేటా సంస్థలు కలిసి ఐదు ఈ-ఆటోలు, చరవాణులు, డ్యాష్ కెమెరాలను కొనుగోలు చేశాయి. కమిషనర్ కార్యాలయంలోని కమాండ్ సెంటర్ ఆవరణలో వాటిని లబ్ధిదారులకు వితరణ చేశాయి. స్వయంఉపాధి కల్పనలో భాగంగా ఆటో నడపడంలో శిక్షణ పూర్తి చేసుకొని లైసెన్సు పొందిన మహిళలకు ఆటోలను ఇచ్చారు. ఒక మహిళా డ్రైవరు నడిపిన ఆటోలో కొత్వాలు కొంత సమయం ప్రయాణించారు. కమిషనర్ కార్యాలయ సిబ్బంది ఆటోలను బాడుగకు మాట్లాడుకుని వాటిలో తమ ఇళ్లకు వెళ్లారు.

రూ.430 కోట్ల విలువైన భూముల స్వాధీనం

నగరంలోని నాగవారలో ఆక్రమణలకు గురైన రూ.430 కోట్ల విలువ చేసే భూములను బెంగళూరు అభివృద్ధి ప్రాధికార (బీడీఏ) స్వాధీనం చేసుకుంది. ఆక్రమణలకు గురైన ఆరు ఎకరాల భూమిలో నిర్మించిన ఆరు షెడ్లు, రెండు నివాసాలను జేసీబీ యంత్రాల సాయంతో తొలగించారు. స్వాధీనం చేసుకున్న భూమి చుట్టూ కంచె ఏర్పాటు చేశారు.

-న్యూస్‌టుడే, బెంగళూరు (యశ్వంతపుర)



హోసూరు ఖబర్లు

వాడివేడిగా సాధారణ సమావేశం

● పాలికె కమిషనర్‌కు సమస్యల వెల్లువ

హోసూరు, న్యూస్‌టుడే: నగర పాలికె కౌన్సిల్ సమావేశం సోమవారం ఐదు గంటలపాటు వాడివేడిగా సాగింది. ఉదయం 10 గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం 3 గంటలకు ముగిసింది. పాలికె కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన శ్రీకాంత్ సమావేశంలో మొదటిసారిగా మాట్లాడారు. కార్పొరేటర్లు ఎదుర్కొంటున్న సమస్యలను విన్న ఆయన సంబంధిత అధికారులను వెంటనే పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. మేయరు ఎస్.ఎ.సత్య నేతృత్వం వహించారు. తొలుత కార్పొరేటరు, పన్నుల కమిటీ ఛైర్మన్ చెన్నీరప్ప మాట్లాడుతూ పరిశ్రమల నుంచి సక్రమంగా పన్ను వసూలు చేయలేదని, 80 శాతం వసూళ్లు స్తంభించాయన్నారు. పాలికె పరిధిలో ఆస్తి, నీటి పన్నుల వసూళ్లలో అవకతవకలు జరిగాయని, ఆదాయానికి గండి పడిందన్నారు. రోడ్ల పక్కన వెలసిన అనధికృత దుకాణాల నుంచి కొందరు పన్ను పేరిట వసూలు చేస్తున్నారని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. టీవీఎస్ నగర్‌లోని విశ్రాంత ఉద్యోగులు విరామ సమయాన్ని గ్రంథాలయంలో గడుపుతున్నారన్నారు. ఇందులో చౌక దుకాణాలకు సంబంధించిన సరకు నిల్వ చేయడంతో వారు ఇబ్బంది పడుతున్నారన్నారు. జూజువాడిలోని ఒకటి, రెండు వార్డుల కౌన్సిలర్లు అశోక్, శ్రీధర్ కొన్ని సమస్యలు వివరించారు. హొగెనెకల్ తాగునీరు సరఫరా కావడం లేదని ఆరోపించారు. గొట్టపు బావుల నుంచి సరఫరా చేస్తున్న నీరు కలుషితమైందని వాపోయారు. వీధి దీపాలు వెలగడం లేదని, వ్యర్థాల తొలగింపునకు అవసరమైన వాహనాలను అందించలేదని మండిపడ్డారు. కార్పొరేటర్లు ఎన్.ఎస్.మాదేశ్వరన్, మంజునాథ, మూకండపల్లి శివరాం, బేడరపల్లి రజని, శాంతినగరు ఇంద్రాణి, అందివాడి భాగ్యలక్ష్మి, ఏఐఏడీఎంకే జయప్రకాష్ తదితరులు సమస్యలు పరిష్కరించాలని వినతి చేశారు.



సమావేశంలో పాల్గొన్న కమిషనరు శ్రీకాంత్, మేయరు, ఉప మేయర్లు సత్య, ఆనందయ్య

9 గ్రామపంచాయతీల విలీనానికి అనుమతి

హోసూరు, న్యూస్‌టుడే: హోసూరు నగర పాలికె పరిధిలో 45 డివిజన్లు ఉన్నాయి. విస్తరణలో భాగంగా తొమ్మిది గ్రామ పంచాయతీల విలీనానికి ప్రభుత్వం అంగీకరించింది. ఆమేరకు హోసూరు పంచాయతీ యూనియన్‌లోని అచ్చెట్టిపల్లి, బేగేపల్లి, చెన్నసంద్రం, కొత్తగొండపల్లి, నల్లూరు, ఒన్నలవాడి, తొరపల్లి అగ్రహారం, పేరండపల్లి, పూనపల్లి గ్రామ పంచాయతీలు త్వరలో విలీనం కానున్నాయి. గ్రామ పంచాయతీల అవధి డిసెంబరులో ముగియనుంది. అంతకు ముందే హోసూరు తాలూకాలోని వీటిని పాలికె పరిధికి తేవడానికి ప్రభుత్వం అంగీకరించింది. ఇకపై పాలికెలో 60 డివిజన్లు ఉంటాయని మేయరు ఎస్.ఎ.సత్య తెలిపారు.

ఉపముఖ్యమంత్రి నియామకంతో సంబరాలు

హోసూరు, న్యూస్‌టుడే: రాష్ట్ర యువజన, క్రీడాభివృద్ధి మంత్రి ఉదయనిధి ఉపముఖ్యమంత్రిగా నియమితులవడంతో డీఎంకే నాయకులు, కార్యకర్తల సంబరం అంబరాన్నంటింది. సీఎం స్టాలిన్ కుమారుడైన ఉదయనిధి పార్టీ యువజన విభాగం కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆయన నేతృత్వంలో యువజన విభాగం బలోపేతం కావడంతో సీఎం ఉపముఖ్యమంత్రి పదవీ బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా హోసూరు మేయరు ఎస్.సత్య, డీఎంకే జిల్లా కార్యదర్శి, హోసూరు ఎమ్మెల్యే వై.ప్రకాష్ ఉదయనిధిని కలిసి అభినందనలు తెలిపారు.



హోసూరు: ఉదయనిధిని అభినందిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్

బాగలూరు సర్కిల్ (బేరికె), న్యూస్‌టుడే: డీఎంకే యువనేత, మంత్రి ఉదయనిధి స్టాలిన్ ఉపముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన నేపథ్యంలో ఆ పార్టీ యూనియన్ కార్యదర్శి గజేంద్ర నేతృత్వంలో నాయకులు, కార్యకర్తలు బాగలూరు సర్కిల్‌లో బాణసంచా పేల్చి సంబరాలు చేసుకున్నారు. ప్రజలకు లడ్డూలు పంచిపెట్టి ఉపముఖ్యమంత్రి ఉదయనిధి జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో యూనియన్ ఉప కార్యదర్శి సి.రమేశ్, ఆదిద్రావిడ సంక్షేమ విభాగం జిల్లా ధ్యక్షుడు పీవీ మునిరాజు, నాయకులు కేపీఆర్ రాజా, బాబు, బషీర్ పాల్గొన్నారు.



బాగలూరు: ఆనందంలో డీఎంకే నాయకులు


బాగలూరులో రైతుబజారు సిద్ధం

బాగలూరు (బేరికె), న్యూస్‌టుడే: బాగలూరు వాసుల 40 ఏళ్ల రైతుబజారు కల నెరవేరింది. ఇన్నాళ్లు ఇక్కడి ప్రధాన రోడ్డుకు ఇరువైపులా సంత నడుపుతున్నారు. చుట్టుపక్కల 80 గ్రామాల నుంచి రైతులు, వ్యాపారులు సరకులు, కాయగూరలదుకాణాలు పెట్టి అమ్ముతున్నారు. కొనుగోలుకు వందలాది వినియోగదారులు వస్తుంటారు. ఈ మార్గంలో రోజూ వందలాది వాహనాల రాకపోకలు సాగుతుంటాయి. సంతతో తరచూ ట్రాఫిక్ స్తంభించడంతో పాటు ప్రమాదాలు జరుగుతున్నాయి. దీనిపై బాగలూరు పంచాయతీ అధ్యక్షుడు వి.డి.జయరాం సంబంధిత అధికారులతో చర్చించారు. వారి అనుమతితో స్థానిక ఏకాంబరేశ్వర ఆలయ పరిధి స్థలంలో పంచాయతీ నిధి రూ.5.80 లక్షలతో 39 దుకాణాలతో కూడిన రైతుబజారు నిర్మించారు. త్వరలోనే ప్రారంభం కానుంది. వాటికి వేలం నిర్వహించి రైతులు, వ్యాపారులకు అప్పగించనున్నట్లు జయరాం న్యూస్‌టుడేకు తెలిపారు.



పూర్తయిన దుకాణాలు

పచ్చదనానికే ప్రాజెక్టు వృక్ష



గుంతల వద్ద సిద్ధం చేసిన మొక్కలు

చిక్కబళ్లాపుర, న్యూస్‌టుడే: రాష్ట్రవ్యాప్తంగా పచ్చదనం పెంపొందించి పర్యావరణను పరిరక్షించడానికి చేపట్టిన ప్రాజెక్టు వృక్షలో భాగంగా రాజధాని బెంగళూరు, చుట్టుపక్కల జిల్లాల్లో వంద రోజుల్లో ఐదువేల మొక్కలు నాటే కార్యక్రమం చురుకుగా కొనసాగుతోంది. ప్రాజెక్టు వృక్ష ఫౌండేషన్‌కు స్థానిక నాయకులతో కలిసి మొక్కలు నాటేందుకు ప్రజలు సహకరిస్తున్నారని ఆ సంస్థ ప్రతినిధి విజయ్ నిశాంత్ తెలిపారు. ఇప్పటికే చిక్కదారహళ్లి, శిడ్లఘట్ట గ్రామాల పరిధిలో నిర్వహించిన కార్యక్రమంలో మొక్కలు నాటామన్నారు. వాటి సంరక్షణ బాధ్యతను స్థానికులకు అప్పగించామన్నారు. నగరంలోని ఇతర ప్రాంతాల్లో పచ్చదనాన్ని పెంపొందిచడానికి ముందుకు వచ్చే వారికి తమ సహకారం అందిస్తామని చెప్పారు. భూతాపం పెరిగిపోతుండటంతో పాటు వాయి కాలుష్యంతో భవిష్యత్తు తరాలకు ముప్పు వాటిల్లుతుందని ప్రతి ఒక్కరూ గ్రహించాలన్నారు. ఇటీవల బెంగళూరు నగరంలో తాగునీటికి అల్లాడాల్సి వచ్చిందని గుర్తు చేశారు. అభివృద్ధి అంటే చెట్లను ఇష్టానుసారంగా నరికేసి నగరాన్ని విస్తరించడం కాదన్నారు. మొక్కలు మానవ మనుగడలో ఒక భాగమన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని ప్రాజెక్టు వృక్ష చేపట్టామని ఆయన వివరించారు.



మొక్క నాటి నీరు పోస్తున్న సభ్యులు

రాజకీయాల్లో ఏమైనా జరగవచ్చు

రామనగర, న్యూస్‌టుడే: రాజకీయాల్లో ఏక్షణంలో ఏం జరుగుతుందో ఎవరూ చెప్పలేరని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సీపీ యోగేశ్వర్ పేర్కొన్నారు. తనకు చెన్నపట్టణ ఉప ఎన్నికల్లో పోటీ చేయాలని ఉందని, తన నియోజకవర్గ ప్రజలూ అదే కోరుకుంటున్నారని చెప్పారు. ఇక్కడ ఆయన విలేకరులతో మాట్లాడుతూ భాజపా తనకు టికెట్ ఇస్తుందన్న నమ్మకం ఉందన్నారు. ఒకవేళ ఇవ్వకపోయినా తన పోటీ తథ్యమన్నారు. కాంగ్రెస్ నుంచి ఇప్పటివరకు ఎవరూ తనను భేటీ కాలేదని స్పష్టం చేశారు. పార్టీ ఫిరాయిస్తారా అని అడిగిన ప్రశ్నలకు రాజకీయాల్లో ఏమైనా జరగవచ్చని వ్యాఖ్యలు చేశారు. తాను పార్టీ మారే ఆలోచన చేయడం లేదన్నారు. 10న ఉప ఎన్నికల తేదీలకు సంబంధించిన నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉందన్నారు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తన పదవికి రాజీనామా ఇస్తారా, న్యాయపోరాటం చేస్తారా అనేది కాంగ్రెస్ అంతర్గత వ్యవహారమని ఒక ప్రశ్నకు సమాధానం ఇచ్చారు.



విలేకరులతో మాట్లాడుతున్న యోగేశ్వర్

స్వచ్ఛ పనులతో పరిసరాలు శుభ్రం

బెంగళూరు (కెంగేరి), న్యూస్‌టుడే: కెంగేరి సమీప బిడదిలోని ఈరేగౌడన చెరువులో టయోటా కిర్లోస్కర్ మోటారు సంస్థ ఆధ్వర్యంలో సోమవారం స్వచ్ఛ పనులు జరిగాయి. ఐ కమ్యూనిటీ ఆక్షన్ టు రీచ్ ఎట్రీవన్ (ఐకేర్) పేరిట ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 200 మందికిపైగా స్వయం సేవకులు, టొయోటా ఉద్యోగులు పాల్గొని చెరువును శుభ్రం చేశారు. ఈ సందర్భంగా కిర్లోస్కర్ మోటారు కార్పొరేట్ వ్యవహారాల పాలన ముఖ్యుడు విక్రమ్‌గులాటి మాట్లాడుతూ స్వచ్ఛ పనులతో పరిసరాలు శుభ్రంగా తయారై అందరూ ఆరోగ్యంగా ఉంటారన్నారు. అనంతరం చెరువు గట్టు చుట్టూ 300 మొక్కలు నాటారు.

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే: బెంగళూరు సర్ ఎం.విశ్వేశ్వరయ్య టర్మినల్ (ఎస్ఎంవిటీ) రైల్వేస్టేషన్‌లో స్వచ్ఛ పనులపై ప్రచారంలో భాగంగా 'పరిశుభ్రత' అంశంపై విద్యార్థులకు వాల్ పెయింట్ పోటీలు నిర్వహించారు. అదనపు డివిజనల్ రైల్వే మేనేజర్ పరీక్షిత్ మోహన్‌పురియా, సీనియర్ డివిజనల్ పర్సనల్ ఆఫీసర్ ఉమాశర్మ తదితరులు విద్యార్థులు గీసిన చిత్రాలను మెచ్చుకున్నారు. ప్రజల్లో పరిశుభ్రతపై అవగాహన పెంచేందుకు నిర్వహించిన ఈ పోటీలో స్కూల్ ఆఫ్ బిజినెస్ అండ్ మేనేజ్‌మెంట్, క్రైస్ట్ యూనివర్సిటీ, వివిధ కళాశాలల నుంచి మొత్తం 11 బృందాలు పాల్గొన్నాయి. విజేతలకు గాంధీ జయంతిన బహుమతులు అందజేయనున్నారు.



ఉద్యానవనాన్ని శుభ్రం చేస్తున్న విద్యార్థులు



మొక్కలు నాటుతున్న విక్రమ్‌గులాటీ తదితరులు



పావగడ: పౌరకార్మికులను సత్కరిస్తున్న ఎస్‌బీఐ సిబ్బంది

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే: నగరంలోని కళ్యాణ నగరలో ఉన్న ఇండో ఏషియన్ అకాడమీ విద్యా సంస్థల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ఇక్కడి పాలికె ఉద్యానవనంలో స్వచ్ఛ పనులు చేపట్టారు. ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్త, పిచ్చి మొక్కలను తొలగించారు. గాంధీ జయంతి సందర్భంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఎన్ఎస్ఎస్ అధికారి ఆచార్య చంద్రశేఖర్ తెలిపారు.

పావగడ, న్యూస్‌టుడే: మన ఆరోగ్యం కోసం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని స్థానిక ఎస్‌బీఐ శాఖ మేనేజరు చంద్రశేఖర్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ఆవరణలో తమ సిబ్బందితో కలిసి ఆయన స్వచ్ఛ పనులు చేపట్టారు. పిచ్చి మొక్కలు, గడ్డిని తొలగించారు. అనంతరం పౌర కార్మికులను సన్మానించారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ సిబ్బంది రామ్‌చరణ్ తేజ, రోహిత్, దయాళ్ చంద్రన్, ఆశారాణి, లక్ష్మిసాధిక్, వికాస్‌రెడ్డి, చంద్రశేఖర్, నాగరాజు, కుమార్, గోకుల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆటోడ్రైవరు మృతి

ధార్వాడ, న్యూస్‌టుడే: యాలక్కి శెట్టర్ కాలనీలో ఆదివారం అర్ధరాత్రి సంభవించిన రోడ్డు ప్రమాదంలో సంజీవ శింధే (48) అనే ఆటోడ్రైవరు మరణించారు. వేగంగా వెళుతున్న సమయంలో ఆటో అదుపుతప్పి బోల్తా కొట్టింది. తీవ్రంగా గాయపడిన శింధేను చికిత్స కోసం ఆసుపత్రికి తరలించేలోగా మరణించారు. ధార్వాడ ట్రాఫిక్ ఠాణా పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

ఉద్యోగం పేరిట వంచన

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే: ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తామంటూ దావణగెరెకు చెందిన రాఘవేంద్ర, సచిన్, మంజునాథ్, గాయత్రి, తిలక్ అనే వ్యక్తులు తన నుంచి రూ.28 లక్షలు తీసుకున్నారని హెచ్‌కే రాఘవేంద్ర అనే వ్యక్తి ఆరోపించారు. తన స్నేహితుడు కిరణ్ ద్వారా మొదట రాఘవేంద్ర పరిచయమైనట్లు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని 2021 నుంచి దశల వారీగా అతడితో పాటు ఆయన అనుచరులు నగదు తీసుకుని మోసం చేశారని బండేపాళ్య ఠాణాలో ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

నేడు బాలిక అప్పగింత

సాంబమూర్తినగర్ (కాకినాడ), న్యూస్‌టుడే: బెంగళూరు నుంచి శేషాద్రి రైలు ఎక్కి ఒంటరిగా ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ చేరుకున్న 14 ఏళ్ల బాలికను మంగళవారం బంధువులకు అప్పగించనున్నారు. ఆదివారం ఆ బాలికను ఆర్పీఎఫ్ అధికారులు సఖి వన్‌స్టాప్, ఛైల్డ్ హెల్ప్‌లైన్ అధికారులకు అప్పగించారు. ఆమె నుంచి సోమవారం మరిన్ని వివరాలు సేకరించారు. మొదట్లో ఆ బాలిక చెప్పినట్లు ఆమె తల్లి రైలు ఎక్కించి వదిలేసి వెళ్లిపోలేదని తేలింది. తనే స్వయంగా బెంగళూరులో రైలు ఎక్కి కాకినాడకు వచ్చినట్లు ఆమె చెప్పింది. బెంగళూరు నుంచి ఆ బాలిక పెద్దనాన్నతోపాటు కానిస్టేబుల్ కాకినాడ వస్తున్నట్లు ఛైల్డ్ హెల్ప్‌లైన్ అధికారులు తెలిపారు. మంగళవారం ఉదయానికి కాకినాడకు చేరుకుంటారని, ఛైల్డ్ వెల్ఫేర్ కమిటీ పర్యవేక్షణలో బాలికను వారికి అప్పగిస్తామని చెప్పారు.

రక్తదానంతో ప్రాణాలు కాపాడండి

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే: మౌంట్ కార్మెల్ కళాశాల, రాష్ట్రీయ సేవా యోజన, యూత్ రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని ఆరోగ్య మంత్రి దినేష్ గుండూరావు మొక్కకు నీరు పోసి ప్రారంభించారు. సోమవారం మౌంట్ కార్మెల్ కళాశాలలో జరిగిన శిబిరంలో మంత్రి మాట్లాడుతూ విద్యార్థులు రక్తదానం చేయడం వల్ల ఎంతోమంది ప్రాణాలు కాపాడిన వారవుతారన్నారు. యువకులు పౌష్టికాహారం తీసుకొని తమ దేహాన్ని ఆరోగ్యంగా ఉంచుకొనేందుకు రక్తదానం ప్రధాన పాత్ర వహిస్తుందన్నారు. కళాశాల డైరెక్టర్ డా.అల్బినా, ప్రిన్సిపల్ డా.జార్జ్‌లేఖ, ఎన్‌సీసీ అధికారి డా.గోవిందగౌడ, లయన్స్ దీపక్‌సుమన్, అధ్యాపకులు శిబిరాన్ని పర్యవేక్షించారు. శిబిరంలో వందలాది విద్యార్థులు రక్తదానం చేశారు. బౌరింగ్, లేడీకర్జన్ ఆసుపత్రులు, లయన్స్ రక్తనిధి, జైన్ ఆసుపత్రి సహకారం అందజేశాయి.



రక్తదాతలను అభినందిస్తున్న మంత్రి గుండూరావు

ధనశ్రీ, చేతనతో మహిళా స్వావలంబన

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే: సమాజంలో ధనశ్రీ, చేతన పథకాల సాయంతో ఆర్థికంగా ఎదగవచ్చని కర్ణాటక మహిళా అభివృద్ధి మండలి అధ్యక్షురాలు జి.పద్మావతి అన్నారు. సోమవారం మండలిలో జరిగిన కార్యక్రమంలో ఆమె ధనశ్రీ, చేతన పథకాలపై అవగాహన కల్పించారు. స్త్రీలకు అవసరమైన ఆదాయం ఈ పథకాలతో సమకూరు తుందని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం తరపున రూ.2 కోట్లు నిధులు వచ్చాయన్నారు. అర్హులకు రూ.30 వేలు చొప్పున సహాయ ధనం మంజూరు చేస్తామన్నారు. చిన్న చిన్న వ్యాపారాలకు ఈ మొత్తాన్ని వినియోగించి ఆర్థిక స్వావలంబన సాధించాలన్నారు. ఇప్పటికే ప్రభుత్వ గ్యారంటీ పథకాలు గృహలక్ష్మి, గృహజ్యోతి, శక్తి యోజన వంటివి వనితలకు ఎంతో ఉపయోగ పడుతున్నాయని గుర్తుచేశారు. మండలి ప్రధాన వ్యవస్థాపకురాలు అక్క మహాదేవి, సీబీఓ సంస్థల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు పాల్గొన్నారు.



పథకాల గురించి వివరిస్తున్న పద్మావతి తదితరులు

ఆరోగ్యకర ఆహార పద్ధతులకు ప్రోత్సాహం

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే: అయోడిన్ లోపంతో తలెత్తే రుగ్మతలను దృష్టిలో ఉంచుకొని కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఆరోగ్యకర ఆహార పద్ధతులను ప్రోత్సహిస్తూ ఆశీర్వాద స్మార్ట్ ఇండియా సోమవారం నగరంలో అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఐటీసీ లిమిటెడ్ సహకారంతో 30 జిల్లాల్లో అయోడిన్ వినియోగం, సమ తుల్య పోషకాహారం ప్రాధాన్యంపై పిల్లలు, గర్భిణులు, బాలింతలు, పారిశుద్ధ్య కార్మికులకు అవగాహన కల్పించడమే లక్ష్యంగా పెట్టుకొంది. కర్ణాటక ఉన్నత విద్యా మంత్రి డా.ఎం.సి.సుధాకర్, ఐటీసీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ అనూజ్ రుస్తాగి పాల్గొన్నారు. మంత్రి సుధాకర్ మాట్లాడుతూ ఆశీర్వాద్ స్మార్ట్ ఇండియాతో కీలకమైన అయోడిన్ లోపంపై అవగాహన కల్పించేందుకు ఐటీసీ, ఐజీడీలు ఒప్పందం చేసుకోవడం ఆనందంగా ఉందన్నారు.



గోడ ప్రతులతో సుధాకర్, అనూజ్‌రుస్తగీ తదితరులు

'ప్రైవేటు సంస్థలను నియంత్రించండి'

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే : బీదర్‌లో ప్రైవేటు ఫైనాన్స్ సంస్థల సంఖ్య ఎక్కువైపోయిందని స్థానిక సంఘాల ప్రతినిధులు ఆరోపించారు. అధిక వడ్డీలతో వేధిస్తున్న సంస్థల ప్రతినిధులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బీదర్ నుంచి వచ్చిన వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు సోమవారం బెంగళూరులో ధర్నాకు దిగారు. అధిక వడ్డీలకు రుణాలు ఇచ్చే సంస్థలను నియంత్రించేందుకు ఉన్న చట్టంలోని లోటుపాట్లను సవరించాలంటూ ఆందోళనకారులు నినాదాలు చేశారు.



నినాదాలు చేస్తున్న ఆందోళనకారులు

నగరంలో ఈనాడు

☆ ఉదయం 10.30 గంటలకు జీకేవీకే ఆవరణలోని డాక్టర్ బాబు రాజేంద్ర ప్రసాద్ అంతర్జాతీయ సమావేశ మందిరంలో నిర్వహించే బెంగళూరు వ్యవసాయ విశ్వవిద్యాలయం సంస్థాపన దినోత్సవాన్ని వ్యవసాయ మంత్రి చెలువరాయస్వామి ప్రారంభిస్తారు.

☆ ఉదయం 10 గంటలకు కుమారకృప రహదారిలోని కర్ణాటక చిత్రకళా పరిషత్తు ఆవరణలో హస్తకళా ఉత్పత్తులతో పాటు వస్త్రాభరణ-2024 ప్రదర్శన కొనసాగుతుంది.

☆ ఉదయం 10 గంటలకు గాంధీ జయంతి సందర్భంగా విద్యార్థులకు పాలికె అధికారులు ఆన్‌లైన్ క్విజ్ పోటీలు ప్రారంభిస్తారు.

☆ ఉదయం 10 గంటల నుంచి జయనగర ఈస్ట్ మొదటి బ్లాక్, రాణి సరళదేవి కళాశాల ఆడిటోరియంలో కర్ణాటక మార్వాడి సమాజం కృతిమ చేతులు, కాళ్లు జోడించే శిబిరాన్ని నిర్వహించనుంది.

-న్యూస్‌టుడే, బెంగళూరు (యశ్వంతపుర)

భగవద్గీత కంఠస్థ పోటీలకు ఆహ్వానం

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే: తితిదే హిందూ ధర్మప్రచార పరిషత్తు, బెంగళూరు అధ్వర్యంలో భగవద్గీతలోని ఆత్మ సంయమన యోగం ఆరో అధ్యాయంలోని శ్లోకాలపై కంఠస్థ పోటీలు జరుగుతాయని పరిషత్తు కార్యక్రమాల నిర్వాహకుడు డాక్టర్ పి.భుజంగరావు తెలిపారు. 18 అధ్యాయాలు పూర్తిగా వచ్చిన వారికీ పోటీలు నిర్వహిస్తామన్నారు. నాలుగు గ్రూపులుగా పోటీదారులను విభజించి విజేతలకు ప్రథమ, ద్వితీయ బహుమతులు అందజేస్తామని తెలిపారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విద్యార్థులకు భగవద్గీత శ్లోకాలు నేర్పించి పోటీలకు సిద్ధం చేయాలని విజ్ఞప్తి చేశారు. మరిన్ని వివరాలకు సెల్‌ఫోన్ నంబరు 7760505503ను సంప్రదించాలని కోరారు.

నిరంతర అభ్యాసంతోనే విజయాలు

చిక్కబళ్లాపుర, న్యూస్‌టుడే: వృత్తి శిక్షణ పూర్తయి ఉద్యోగాల్లో చేరినా నిరంతర అభ్యాసం, కొత్తవాటిని నేర్చుకోవాలన్న ఆసక్తి ఉంటేనే విజయాలు వరిస్తాయని ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఎలక్ట్రికల్స్ ఇంజినీర్స్ ఆచార్యుడు డాక్టర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. ఎస్‌జేసీ టెక్నికల్ వర్సిటీలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులకు సంబంధించి ఏడు సంఘాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థుల కోసం తాము క్రమం తప్పకుండా కార్యశాలలో 120 పైగా సాంకేతిక కథనాలు ప్రదర్శిస్తూ వస్తున్నామని చెప్పారు. వీటితో విద్యార్థుల్లో జ్ఞాన వికాసం కలుగుతుందన్నారు.

ఆనంద్‌కుమార్‌కు జాతీయ పురస్కారం

కేపీసీసీ సీనియరు నాయకుడు ఆనంద్‌కుమార్ 'రాష్ట్రీయ పద్మభూషణ్ సమ్మాన్' పురస్కారాన్ని అందుకున్నారు. దిల్లీలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ముంబయి పోలీసు సహాయక కమిషనర్ నరసింగ్ యాదవ్, భారతీయ కుస్తీ క్రీడాకారిణి నేహారాణి ఆయనకు ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు. పేద కుటుంబాల విద్యార్థుల చదువుకు సహకారం, సామాజిక సేవలను పరిగణనలోకి తీసుకొని ప్రపంచ సంస్థలోని మానవ హక్కుల కమిషన్ ఈ పురస్కారాలను అందిస్తూ వస్తోంది.



-న్యూస్‌టుడే, బెంగళూరు (గ్రామీణం)

డాడ్జ్‌బాల్ ఛాంపియన్‌గా కర్ణాటక



జాతీయ స్థాయి డాడ్జ్ బాల్ పోటీలో సబ్-జూనియర్ విభాగంలో కర్ణాటక బాలికల జట్టు ఛాంపియన్‌షిప్ సాధించింది. ఈమేరకు సోమవారం కర్ణాటక డాడ్జ్‌బాల్ సంఘం ప్రధాన కార్యదర్శి కె.నరసింహారెడ్డి తెలిపారు. ఆదివారం సాయంత్రం పుదుచ్చేరిలోని రాజీవ్‌గాంధీ ఇండోర్ క్రీడాంగణంలో ముగిసిన టోర్నీలో వివిధ రాష్ట్రాల నుంచి 24పైగా జట్లు పాల్గొన్నాయి. కర్ణాటక జట్టు సభ్యురాలు వర్షరాజ్ అత్యుత్తమ క్రీడాకారిణిగా వ్యక్తిగత బహుమతి అందుకుందని ఆయన తెలిపారు. బాలుర విభాగంలో కర్ణాటక నాలుగో స్థానంలో నిలిచిందని ఆయన చెప్పారు.

-న్యూస్‌టుడే, బెంగళూరు (క్రీడలు)

'స్వాలోయింగ్ ది సన్' ఆవిష్కరణ

లక్ష్మీ మురుడేశ్వర్ పూరి రచించిన 'స్వాలోయింగ్ ది సన్' పుస్తకాన్ని గీతాంజలి విక్రమ్ కిర్లోస్కర్, విద్యా గజపతిరాజుసింగ్, అనితా నాయర్ తదితరులు విడుదల చేశారు. ప్రభా ఖైతాన్ ఫౌండేషన్ ముద్రించిన ఈ పుస్తకంలోని అంశాలపై రచయిత్రితో కలిసి వివిధ రంగాలకు చెందిన నిపుణులు చర్చించారు. విశ్వ సంస్థలో మాజీ అసిస్టెంట్ సెక్రటరీ జనరల్‌గా, రాయబారిగా వ్యవహరించిన లక్ష్మీ మురుడేశ్వర్ పూరి ఈ పుస్తకంలో పలు అంశాలను సృజించారు. ప్రపంచంలో వస్తున్న మార్పులు, పర్యావరణంపై పడుతున్న ప్రభావం తదితర అంశాలను ఇందులో పొందుపరిచారు.



-న్యూస్‌టుడే, బెంగళూరు (శివాజీనగర)

పికల్‌బాల్ ఆటగాళ్లకు జెర్సీల వితరణ



జాతీయ పికల్‌బాల్ పోటీలో పాల్గొంటున్న కర్ణాటక పురుష, మహిళల జట్లకు సోమవారం జెర్సీ వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అఖిలభారత, హరియాణ పికల్‌బాల్‌ల సంఘాల ఆధ్వర్యంలో 4 నుంచి మూడు రోజుల పాటు జరిగే పోటీలో కర్ణాటక, పురుష మహిళల జట్లు పాల్గొంటున్నట్లు రాష్ట్ర సంఘం సంస్థాపక ప్రధాన కార్యదర్శి రజత్‌కంకర్ తెలిపారు. టెన్నిస్, టీటీ, బ్యాడ్మింటన్ ఆటలు కలిసి ఉన్న పికల్‌బాల్ పోటీలో తలపడుతున్న జట్లలో అనుభవం కలిగిన ఆటగాళ్లు ఉన్నారన్నారు.

-న్యూస్‌టుడే, బెంగళూరు (క్రీడలు)

బళ్ళారి

• బళ్ళారి • రాయచూరు

మంత్రి ఇంటి వద్ద నేడు ఆందోళన

రాయచూరు, న్యూస్‌టుడే: గ్రామపంచాయతీల సిబ్బంది సమస్యలు పరిష్కరించాలంటూ మంగళవారం కలబురగిలోని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి ప్రియాంక్ ఖర్గే ఇంటి వద్ద ఆందోళన నిర్వహిస్తామని పంచాయతీ ఉద్యోగుల సంఘం జిల్లాధ్యక్షుడు మల్లికార్జున తెలిపారు. పన్నుల వసూలుదారులు, క్లర్కులు, డాటా ఆపరేటర్లు, పౌర కార్మికులు, వాటర్ మ్యాన్లు, స్వీపర్ల ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని, అంతవరకు రూ.31 వేలు వేతనం చెల్లించాలని, పదవీ విరమణ చేసిన వారికి, మృతి చెందిన ఉద్యోగి కుటుంబానికి రూ.6 వేలు పింఛన్ ఇవ్వాలని ఒత్తిడి తెస్తామన్నారు. ఖాళీ ఉద్యోగాలను భర్తీ చేయాలని, గ్రేడ్ 1, 2 కార్యదర్శి, ద్వితీయ శ్రేణి అకౌంటెంట్ పోస్టుల భర్తీ సమయంలో సీనియార్టీ ఆధారంగా సిబ్బందికి పదోన్నతి కల్పించాలని కోరుతామని స్పష్టం చేశారు.

రహదారి మరమ్మతులకు డిమాండ్

రాయచూరు, న్యూస్‌టుడే: దేవదుర్గ తాలూకా జాలహళ్లి మురార్జీదేశాయి వసతి పాఠశాల రహదారిని వారం లోపు మరమ్మతులు చేయించాలని, జాప్యం చేస్తే ఎమ్మెల్యే కరెమ్మనాయక్ ఇంటి వద్ద ధర్నా చేస్తామని కరవే జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ భజంత్రి హెచ్చరించారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. గత నెలలో కురిసిన వానలకు రోడ్డు దారుణంగా తయారవడంతో విద్యార్థులు సంచరించేందుకు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యను దేవదుర్గ తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లినా, ఎమ్మెల్యే రహదారిని పరిశీలించినా బాగు కాలేదని వాపోయారు. తాజాగా జిల్లా పాలనాధికారి నితీష్‌కు సమస్యను తెలియజేసినట్లు చెప్పారు. సమావేశంలో గంగణ్ణ, గురునాథ రెడ్డి, పాషా, రామనగౌడ, భీమణ్ణ పాల్గొన్నారు.

ఆకాశగంగకు
దోసిలిపడితే పులకింత!
'బెంగళూరు' భవితకు అదే శ్రీరామరక్ష



శివార్లలో వాననీటి సంరక్షణకు చర్యలు



చెరువుల సంరక్షణకు పెద్దపీట

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే: నదులు, వాగులు లేని సముద్రమట్టానికి 12 వందల మీటర్ల ఎత్తులో ఉన్న బెంగళూరు నగరంలో వాననీటి సంరక్షణే శ్రీరామరక్ష. ఆ అంశాన్ని విస్మరిస్తే జలక్షామం తప్పదని అంతర్జాతీయ నీటి సంరక్షణ పరిశోధన సంస్థ హెచ్చరింపక కూడా పాలకుల్లో స్పందన కరవు. ఇప్పటి నుంచే ఈ చర్యలు చేపట్టకపోతే భవిష్యత్తులో ప్రజలు నానా అగచాట్లు చవిచూడక తప్పదని లండన్‌కు చెందిన ఆ సంస్థ ఐదేళ్ల కిందటే హెచ్చరించిన విషయం తెలిసిందే. ఆ హెచ్చరికలను పాలకులు పట్టించుకోలేదు. దాని ఫలితం వర్షాకాలంలోనూ నగరవాసులు అనుభవిస్తున్నారు. వాననీటికి దోసిలి పడితే.. అనేక సమస్యల నుంచి గట్టెక్కవచ్చని నగరంలోనే విస్తరించిన భారతీయ విజ్ఞాన సంస్థ (ఐఐఎస్‌సీ) పదేపదే హెచ్చరిస్తోంది. నదులు, వాగులు లేని బెంగళూరు నగరం పూర్తిగా వాననీటిపై ఆధారపడాలి. వంద కిలోమీటర్ల దూరం నుంచి నిత్యం 1450 ఎంఎల్‌డీ 'కావేరి' నదీజలాలను సరఫరా చేస్తున్నారు. అంతకు పూర్వం నగరవాసులు భూగర్భజలాలపై ఆధారపడేవారు. పూర్వపు రాజు- నగర నిర్మాత కెంపే గౌడ వాననీటి సంరక్షణ కోసం చెరువులు విస్తారంగా తవ్వించారు. ఆనాటి నుంచి వాననీటిని ఒడిసి పట్టుకున్న చెరువులే నగరాన్ని ఆదుకున్నాయి. భూగర్భ జలాల మట్టం పెరిగి బావులు కళకళలాడేవి. కాలక్రమంలో కెంపేగౌడ తవ్వించిన వెయ్యికిపైగా చెరువులు కనుమరుగై ప్రస్తుతం 86కు కుదించుకుపోయాయి. అవీ ఎప్పుడు మాయమవుతాయో తెలియని దుస్థితి. ప్రస్తుతానికి కావేరి నీటిని తరలించుకొస్తున్నా.. ఇదంతా వ్యయప్రయాసలమయం. ఇప్పటికైనా వాననీటి సంరక్షణ మరోసారి ప్రారంభించి కొనసాగిస్తూ భూగర్భజలాల మట్టం పెరుగుతుందని జల నీటి నిపుణుడు డాక్టర్ శివకుమార్ 'న్యూస్‌టుడే'కి వివరించారు. నగరానికి చేరువలోని తిప్పగొండనహళ్లి, హెసరఘట్ట, బెళ్లందూరు, వర్తూరు, యలహంక తదితర చెరువులను సిద్ధం చేస్తే తాగునీటి ఎద్దడి నివారించవచ్చు. కావేరి నీరు సరఫరా కాకముందు నగరం బెంగళూరుకు తిప్పగొండనహళ్లి, హెసరఘట్ట చెరువులు దాహం తీర్చడం ప్రస్తావనార్హం. భవనాలకు అనుబంధంగా ఆకాశగంగకు చోటిచ్చే నిర్మాణాలు చేపడితే నగరం సమస్య అదుపులోకి వస్తుందన్నారు. తప్పనిసరిగా వాననీటి సంరక్షణ చర్యలు చేపట్టాలనే చట్టం తెచ్చిన క్రమంలో అధికారులు సక్రమంగా నిబంధనలు అమలు చేయాలనే డిమాండు తెరపైకి వచ్చింది.



మురుగునీటి శుద్ధీకరణ విధానాల విస్తరణ



ఓ ఉద్యానవనంలో ఇంకుడు గుంత

'సాగునీటికి సీఎంను అడ్డుకుంటాం'



పాత్రికేయులకు వివరిస్తున్న ప్రభాకర్‌పాటిల్

రాయచూరు, న్యూస్‌టుడే: తుంగభద్ర ఎడమ కాలువ చివరి ఆయకట్టు భూములకు సాగు నీటిని సరఫరా చేయాలని అక్టోబరు తొలి వారంలో జిల్లాకు విచ్చేస్తున్న ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను అడ్డుకుంటామని రైతు సంఘం జిల్లాధ్యక్షుడు ప్రభాకర్ పాటిల్ వెల్లడించారు. ఆయన సోమవారం పత్రికాభవన్‌లో పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 22న తుంగభద్ర జలాశయం వద్ద సీఎంను కలిసి శివారు పొలాలకు సాగు నీరందక వరి, పత్తి, మిరప పంటలు నష్టపోతున్న విషయాన్ని ఆయన దృష్టికి తెచ్చామన్నారు. మూడు రోజుల్లో నీరు వదలాలని కొప్పళ జిల్లా బాధ్య మంత్రి శివరాజ్‌తంగడి, రాయచూరు జిల్లా బాధ్య మంత్రి శరణప్రకాష్‌కు ముఖ్యమంత్రి సూచించారన్నారు. ఇప్పటి వరకు చుక్క నీరు చేరలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం సమావేశాన్ని ఏర్పాటు చేయకపోవడం శోచనీయమన్నారు. నీటి నిర్వహణలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని ధ్వజమెత్తారు. నారాయణపుర కుడి కాలువ ఆధునికీకరణ పనుల అక్రమాలపై దర్యాప్తు చేయించాలని సీఎంపై ఒత్తిడి తెస్తామన్నారు. అధికారంలోకి వచ్చిన 24 గంటల్లో అక్రమార్కులను జైలుకు పంపుతామని సీఎం సిద్ధరామయ్య ప్రకటించారని, పగ్గాలు చేపట్టి ఏడాది దాటినా ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం బాధాకరమన్నారు. ఆయన వెంట సంఘం నాయకులు బూదయ్యస్వామి, భీమణ్ణనాయక్, హాజీమస్తాన్ తదితరులు ఉన్నారు.

నేటి నుంచి మంత్రి బోసురాజు పర్యటన

మాన్వి, న్యూస్‌టుడే: రాష్ట్ర శాస్త్ర, సాంకేతిక శాఖల మంత్రి ఎన్.ఎస్.బోసురాజు మంగళ, బుధ, గురు, శుక్రవారాల్లో జిల్లాలో పర్యటించనున్నారు. ఈమేరకు మంత్రి ఆప్తకార్యదర్శి వీరభద్రప్ప హంచినాళ్ ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 10.30 గంటలకు రాయచూరు రంగ మందిరంలో నిర్వహించే విశ్వ సీనియర్ సిటిజన్స్ డే కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు సిరివార తాలూకాలో పర్యటిస్తారు. బుధవారం 10.15 గంటలకు రాయచూరులో జరిగే గాంధీ జయంతిలో పాల్గొంటారు. 11 గంటలకు మాన్వికి వస్తారు. తాలూకా ప్రైవేటు శిక్షణ సంస్థలు నిర్వహించిచే ఉపాధ్యాయుల దినోత్సవానికి హాజరవుతారు. సాయంత్రం 6 గంటల వరకు మాన్విలో వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారు. రాత్రి రాయచూరులో బస చేస్తారు. గురువారం అక్కడ జరిగే నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొంటారు. శుక్రవారం మంత్రి సింధనూరు తాలూకాలో పర్యటిస్తారని అందులో పేర్కొన్నారు.

బతికుండగానే.. శిశువును పూడ్చేశారు

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే : ఆనేకల్ తాలూకా కత్రిగుప్పె దిణ్ణె గ్రామంలో నవజాత శిశువును కన్నవారే దిబ్బలో సగం పూడ్చి వెళ్లారు. స్థానిక మహిళ ఒకరు బహిర్భూమికి వెళ్లిన సమయంలో ఏడుపు వినిపించడంతో ఒక మహిళ అక్కడ చూడగా దిబ్బలో ఒక బిడ్డ కనిపించింది. ఆ మగ బిడ్డను రక్షించిన బాలల రక్షణ మండలి అధికారి హెచ్‌కే ఆశకు అప్పగించింది. నవజాత శిశువు ఒంటిపై గాయాలు ఉండడంతో దొమ్మసంద్ర ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించి, చికిత్స ఇప్పిస్తున్నారు. సర్జాపుర ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

కుటుంబం.. విషాద పయనం
ప్రమాదంలో నలుగురు మృతి

ఉడుపి, న్యూస్‌టుడే : కార్కళ నుంచి కుక్కె సుబ్రహ్మణ్యకు వెళ్లే రహదారిలో హొస్మారు పాజెగుడ్డె సమీపాన సోమవారం మధ్యాహ్నం సంభవించిన రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు దుర్మరణం చెందారు. మృతులను సురేశ్ ఆచార్య (36), ఆయన కుమార్తెలు సమీక్ష (7), సుశ్మిత (5), కుమారుడు శుశాంత్ (2)లను మృతులుగా గుర్తించారు. సురేశ్ భార్య మీనాక్షి ఆచార్య (32) తీవ్రంగా గాయపడ్డారు. ఆమెను చికిత్స కోసం స్థానిక ఆసుపత్రిలో చేర్పించారు. తమ ముగ్గురు పిల్లలతో కలిసి ఒకే బైకులో వెళుతున్నప్పుడు ఎదురుగా వచ్చిన మినీ లారీ ఢీకొనడంతో ప్రమాదం సంభవించింది. కార్కళ గ్రామీణ ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

అన్నదాత నీటిపాలు

కలబురగి: హునగుంద తాలూకా మూగనూరులో ఆదివారం రాత్రి బైకులో ఇంటికి వెళుతున్న సమయంలో వాగులోకి పడిపోయి శివప్ప బసవనళ (38) అనే రైతు మరణించారు. భారీ వర్షంలో వంతెనపైకి నీరు రావడంతో అతను నీటిలో పడిపోయాడని గుర్తించారు. సోమవారం ఉదయం అతని మృతదేహాన్ని వెలికి తీశారు. అమీనగడ ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

కారు టైరు పేలి ఒకరి దుర్మరణం

బొంరాస్‌పేట (కొడంగల్), న్యూస్‌టుడే: వేగంగా వెళ్తున్న కారు టైర్ పేలడంతో ప్రమాదానికి గురై ఒకరు మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్‌ఐ రవూఫ్ తెలిపిన ప్రకారం.. సోమవారం తెల్లవారు జామున 1 గంట ప్రాంతంలో హైదరాబాద్ నుంచి కర్ణాటకలోని మల్కేడ్ గ్రామానికి బయలుదేరి ఓ కారు వికారాబాద్ జిల్లా, బొంరాస్‌పేట చెరువు మలుపు వద్దకు రాగానే టైర్ పేలి అదుపు తప్పి ఎదురుగా వస్తున్న లారీని ఢీ కొట్టింది. ఈ సంఘటనలో కారులో ప్రయాణిస్తున్న విశ్వనాథ్ (49) అక్కడికక్కడే మృతి చెందగా మరో ఇద్దరు.. రవి కుమార్, రవిచంద్రలకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని హైదరాబాద్‌కు తరలించారు. మృతుడు మల్కేడ్‌కు చెందిన వ్యక్తిగా గుర్తించారు. అతని బంధువు భాస్కర్‌రావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన వివరించారు.

తుంగభద్ర జలాశయం నీటిమట్టం

పూర్తిస్థాయి నీటిమట్టం 1633 అడుగులు

30-09-2024 (ఉ॥ 8 గంటలకు)	ప్రస్తుతం	గత సంవత్సరం
నీటిమట్టం (అడుగుల్లో)	1632.00	1618.23
ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	10,633	1419
అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	10,153	9,739
నీటి నిల్వ (టి.ఎం.సి)	101.773	56.505

గరిష్ఠసామర్థ్యం (133 టీఎంసీలు) వాస్తవసామర్థ్యం 105.788 టీఎంసీలు

రైల్వే మార్గం పనుల పూర్తికి విజ్ఞప్తి



జస్టిస్ శివరాజ్‌పాటిల్‌కు బొకే ఇస్తున్న బాబురావు

రాయచూరు, న్యూస్‌టుడే: గిణిగేరా-మహబూబ్‌నగర్ రైల్వే మార్గం పనులను త్వరగా పూర్తి చేసేలా రైల్వే శాఖ సహాయ మంత్రి వి.సోమణ్ణపై ఒత్తిడి తేవాలని దక్షిణ మధ్య రైల్వే సలహా సమితి మాజీ సభ్యుడు, భాజపా జిల్లా ఉపాధ్యక్షుడు బాబురావు విశ్రాంత న్యాయమూర్తి, కర్ణాటక సరిహద్దు, నదుల రక్షణ కమిషన్ అధ్యక్షుడు జస్టిస్ శివరాజ్ పాటిల్‌కు విన్నవించారు. సోమవారం బాబురావు బెంగళూరులో శివరాజ్‌పాటిల్‌ను కలిసి మాట్లాడారు. పాతికేళ్ల క్రితమే ప్రారంభమైన ఈ మార్గం పనులు ఇంకా పూర్తి కాలేదన్నారు. బడ్జెట్‌లో అధికంగా నిధులను సమకూర్చి, రాష్ట్రం సహకరిస్తే త్వరగా ముగిసే అవకాశముందన్నారు. ఈ మార్గం అందుబాటులోకి వస్తే కొప్పళ జిల్లావాసులు హైదరాబాద్, బెంగళూరుకు రాకపోకలు సాగించేందుకు రవాణా సదుపాయం లభిస్తుందని వివరించారు. ఈ విషయమై తాను కేంద్ర మంత్రితో మాట్లాడతానని పాటిల్ హామీ ఇచ్చినట్లు బాబురావు వెల్లడించారు.

దర్యాప్తు సంస్థను మార్చాల్సిందే



మాట్లాడుతున్న అంబాజీరావ్

రాయచూరు, న్యూస్‌టుడే: కోట్లాది రూపాయల డిపాజిట్లను అక్రమంగా సేకరించి ఖాతాదారులను వంచించిన దర్వేశ్ కంపెనీపై నమోదైన కేసును ఛేదించే బాధ్యతను ఈడీ లేదా సీబీఐకి అప్పగించాలని సామాజిక కార్యకర్త అంబాజీరావ్ మైదరకర్ ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. సీఐడీ పరిశోధన మందగతిన సాగుతున్నందున పెట్టుబడిదారుల్లో ఆందోళన నెలకొందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని దర్యాప్తు సంస్థను మార్చాలని కోరుతున్నట్లు చెప్పారు. ఇప్పటివరకు ఆ కంపెనీ డైరెక్టర్లలో ఏ ఒక్కరినీ అరెస్టు చేయలేదని, కొద్దిమంది ఏజెంట్లను మాత్రమే అదుపులో తీసుకోవడం చూస్తుంటే సీఐడీ చేపట్టిన దర్యాప్తులో లోపాలున్నట్లు అనుమానం బాధితుల్లో ఏర్పడిందన్నారు. 2021 నుంచి 2024 వరకు ఏజెంట్లు, సబ్-ఏజెంట్లు వీరి కుటుంబ సభ్యులు సంపాదించిన ఆస్తుల వివరాలు సేకరించాలని డిమాండు చేశారు. బెంగళూరులోని సీఐడీ అధికారులను కలిసే విషయమై చర్చిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో డిపాజిట్‌దారులు మసూద్ ఆలీ, అశీఫ్, సయ్యద్ ఇమామ్, జాఫర్, హాజీ ఇబ్రహీం, నజీర్ బేగ్ పాల్గొన్నారు.

జీవితంలో క్రమశిక్షణ అవసరం



జాకోబ్‌ను సన్మానిస్తున్న లయోలా సంస్థ నిర్వాహకులు

మాన్వి, న్యూస్‌టుడే: విద్యార్థులు మన సంస్కృతి, సంప్రదాయాలను విస్మరించరాదని ప్రముఖ దళిత కవి జాకోబ్ దొడ్డమని పేర్కొన్నారు. సోమవారం స్థానిక లయోలా కళాశాలలో ఆయన జానపద హాడుగబ్బ అనే కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. జీవితంలో క్రమశిక్షణ, శాంతి, సమయపాలన, నిరంతర ప్రయత్నం చాలా అవసరమన్నారు. ఇవి ఉంటే అన్ని రంగాల్లో రాణించవచ్చన్నారు. విద్యార్థులు సమయాన్ని వృథా చేస్తున్నారని, ఇది సరైన పద్ధతి కాదన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని అవసరం మేరకు వాడాలని హితవు పలికారు. వ్యసనాలు, దురలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. జానపద గీతాల ద్వారా సమస్యలు, వాటికి పరిష్కారాలను వివరించారు. సంస్థ నిర్వాహకులు ఫాదర్ వినోద్‌పాల్, ఫాదర్ సిరిల్‌రాజ్, దేవణ్ణ, పి.సుధా, జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

జన గణన తర్వాతే వర్గీకరణ



అధికారికి వినతిపత్రం అందిస్తున్న ప్రతినిధులు

రాయచూరు, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని ప్రతి గ్రామంలో ఎస్సీ, ఎస్టీల జన గణన చేసి.. . ఆది కర్ణాటక, ఆది ద్రావిడ కుల జన గణనలో సందిగ్ధతను నివారించిన తర్వాతే దళిత వర్గీకరణ చేయాలని 'కర్ణాటక రాష్ట్ర చలవాది మహాసభ' ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు విజ్ఞప్తి చేసింది. ఈమేరకు సోమవారం మహాసభ జిల్లా అధ్యక్షుడు శివరాజ్ జానేకల్, ప్రధాన కార్యదర్శి తమ్మణ్ణ, ప్రతినిధులు రవీంద్రనాథ పట్టి, రవికుమార్ రాంపూర నాయకత్వంలో జిల్లా పాలనాధికారి కార్యాలయం అధికారికి వినతిపత్రం ఇచ్చారు. కొన్ని జిల్లాల్లో హొలెయ, మాదిగలను ఆది కర్ణాటక అని, ఇంకొన్ని జిల్లాల్లో ఆది ద్రావిడగా వ్యవహరిస్తున్నందున గందరగోళం నెలకొందన్నారు. సదాశివ కమిషన్ దళితుల ఆర్థిక, సామాజిక, విద్యా స్థితిగతులనే అధ్యయనం చేసిందన్నారు. కులాల, ఉప కులాల వివరాలను సేకరించే అధికారం ప్రభుత్వం ఇవ్వలేదన్నారు. శాస్త్రీయంగా గణించిన జనాభా లెక్కలు ప్రభుత్వం వద్ద లేవన్నారు. చలవాదిలు వర్గీకరణకు వ్యతిరేకం కాదని, అన్ని పరిష్కరించే ముందు అడుగు వేయాలని కోరుతున్నట్లు స్పష్టం చేశారు.

3 నుంచి నవరాత్రి ఉత్సవాలు



వివరాలు తెలుపుతున్న పాపారెడ్డి

రాయచూరు, న్యూస్‌టుడే: స్థానిక గద్వాల్ రహదారిలోని లక్ష్మీదేవి, కాళికాదేవీ దేవస్థానంలో 3 నుంచి 11 వరకు దసరా నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని ఉత్సవ సమితి అధ్యక్షుడు ఎ.పాపారెడ్డి తెలిపారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. నాలుగేళ్లుగా ఉత్సవాలను వైభవంగా జరుపుతున్నట్లు చెప్పారు. ధార్మిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు పాఠశాలలు, కళాశాలల విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామని చెప్పారు. విజేతలకు నగదు బహుమతులను ప్రదానం చేస్తామన్నారు. రాష్ట్రం, జిల్లాలో పేరుగాంచిన సంగీత, నృత్య కళాకారులతో ప్రదర్శనలు ఉంటాయని వివరించారు. భక్తులు తొమ్మిది రోజుల ఉత్సవాలకు హాజరుకావాలని కోరారు. సమావేశానికి మున్నూరు కాపు సమాజం అధ్యక్షుడు బెల్లం నరసరెడ్డి, ప్రధాన కార్యదర్శి జి.బసవరాజరెడ్డి, ప్రతినిధులు భంగి నరసరెడ్డి, గుడిసె నరసరెడ్డి, పుండ్ల రాజేంద్ర రెడ్డి, శేఖరరెడ్డి, శ్రీనివాస రెడ్డి, ఉట్కూరు కృష్ణమూర్తి తదితరులు హాజరయ్యారు.

సన్నాహక సమావేశం నేడు

రాయచూరు, న్యూస్‌టుడే: కన్నడ భాష హక్కుల సాధన కోసం జరిగిన గోకాక్ (బెళగావి జిల్లా) పోరాటాన్ని నేటి తరానికి తెలియజేసేందుకు ఈనెల 5న రాయచూరు వ్యవసాయ విజ్ఞాన విశ్వవిద్యాలయం ఆవరణలో విభాగ స్థాయి సభ నిర్వహించనున్నారు. దీన్ని విజయవంతం చేసేందుకు మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు జడ్పీ సభా భవన్‌లో సన్నాహక సమావేశం జరగనుంది. పలు సంఘాలు, సంస్థల ప్రతినిధులు హాజరై తగు సలహాలు, సూచనలు ఇవ్వాలని జిల్లా అదనపు పాలనాధికారి శివానంద ఒక ప్రకటనలో కోరారు.

సాంస్కృతిక కూడలి సింధనూరు



సింధనూరు కాంగ్రెస్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వసంతకుమార్

సింధనూరు, న్యూస్‌టుడే: సింధనూరు ఒక మినీ భారత్ వంటిది.. ఇక్కడ అనేక ప్రాంతాల వారు ఉన్నారు. భిన్న సంస్కృతులు ఇక్కడే ఉన్నాయని ప్రదేశ్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, విధానపరిషత్ సభ్యుడు వసంతకుమార్ పేర్కొన్నారు. స్థానిక పీడబ్ల్యూడీక్యాంపులోని అన్నదానేశ్వర కల్యాణ మండపంలో సోమవారం కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సింధనూరు దసరా ఈనెల 4న ప్రారంభమై తొమ్మిది రోజుల వేడుకలు జరుగనున్న సందర్భంగా ముందస్తు ఏర్పాట్ల కోసం కాంగ్రెస్ తమ కార్యకర్తల సమావేశాన్ని జరిపింది. కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్సీ వసంతకుమార్.. ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాలినీ రజనీశ్ వంటి వారు విచ్చేయనున్న ఈ వేడుకలు మైసూరుకు ఏమాత్రం తీసిపోని విధంగా ఆచరించేందుకు కార్యకర్తలంతా సహకరించాలని వసంతకుమార్ విజ్ఞప్తి చేశారు. అనంతరం ఎమ్మెల్యే బాదర్లి కార్యకర్తలకు పలు సూచనలు అందించారు. పార్టీ సీనియర్ నాయకులు శ్రేణిక్‌రాజ్‌శేర్, లింగరాజ్, బసవరాజ్ హిరేగౌడ, ఎన్.అమరేశ్, లలితా చుండూరి, ద్రాక్షాయణి, బసమ్మ, రామనగౌడ పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే రేపటి పౌరులు దృఢం



విద్యార్థికి కోడిగుడ్డు తినిపిస్తున్న ఎమ్మెల్యే బాదర్లి

సింధనూరు, న్యూస్‌టుడే: పిల్లలు ఆరోగ్యంగా ఉంటేనే చదువులు సాగుతాయి.. పౌష్టికాహారం తీసుకుని విద్యార్థులు ఆరోగ్యాన్ని మెరుగుపర్చుకోవాలని శాసనసభ్యుడు బాదర్లి హంపనగౌడ కోరారు. అజీం ప్రేమ్‌జీ ఫౌండేషన్ సహకారంతో రాష్ట్ర ప్రభుత్వ అక్షరదాసోహ - మధ్యాహ్న భోజన పథకంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఇక వారంలో రెండు రోజులు కాకుండా ఆరు రోజులూ పౌష్టికాహారం గుడ్డు, అరటి పండు, సంగం చిక్కీ తదితర ఆహారాన్ని ఇచ్చే పథకానికి శ్రీకారం చుట్టింది. సోమవారం పీడబ్ల్యూడీ క్యాంపులోని జూనియర్ కళాశాల మైదానంలో గల బాలుర ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్యే ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థినీ విద్యార్థులకు ఉడికించిన కోడిగుడ్డు, అరటిపళ్లు తినిపించడం ద్వారా ప్రారంభించారు. పికార్డ్ బ్యాంకు అధ్యక్షుడు ఎం.దొడ్డబసవ రాజ్, బీఈఓ వాజీద్ మజీద్, వైస్ ప్రిన్సిపల్ జి.సమత శర్మ, ఎస్‌డీఎంసీ అధ్యక్షుడు భీమరెడ్డి, అజీం ఫౌండేషన్ నళిని పాల్గొన్నారు.

సింధనూరు బంద్‌కు ఐక్య పోరాట సమితి పిలుపు



బంద్ విషయాన్ని వెల్లడిస్తున్న దళిత సంఘాల నాయకులు

సింధనూరు, న్యూస్‌టుడే: ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ ఉప వర్గీకరణలో ఎన్నికలకు ముందు ఒక మాట.. అనంతరం మరోమాట మాట్లాడుతున్న రాష్ట్ర ప్రభుత్వ తీరును ఖండిస్తూ ఈనెల 3న సింధనూరు బంద్ పాటిస్తున్నామని సింధనూరు ఉప వర్గీకరణ (ఒళ మీసలాతి) ఐక్య పోరాట సమితి ప్రకటించింది. ఈ మేరకు సోమవారం నాయకులు విలేకరులకు వెల్లడించారు. గ్యారంటీ రామయ్యగా పేరొందిన ముఖ్యమంత్రి సిద్ధరామయ్య న్యాయమూర్తి సదాశివ కమిషన్ అమలు చేయడంలో మీనమేషాలు లెక్కించడం శోచనీయమని దుయ్యబట్టారు. కమిషన్ ఏర్పాటుకు పదేళ్లు, ఏర్పడిన కమిషన్ తన పని ప్రారంభించడానికి ఇంకో పదేళ్లు, సిద్ధం చేసిన నివేదికను సమర్పించడానికి మరో పదేళ్లు ఇలా 30 ఏళ్లుగా మా పోరాటానికి కళ్లు కాయలుకాచేలా ఎదురుచూసినా ఫలితం దక్కడం లేదని నాగరాజపూజార్, బోన్వంచర్, మరియప్ప, యమునప్ప తెలిపారు. తమ హక్కులను కాపాడుకోవడానికి బంద్‌కు పిలుపునిచ్చినట్లు ప్రకటించారు.

సిద్ధరామయ్య రాకకు మాన్వి ముస్తాబు



పనులను పర్యవేక్షిస్తున్న రవి బోసురాజు తదితరులు

మాన్వి, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి హోదాలో సిద్ధరామయ్య తొలిసారి మాన్వికి వస్తున్న క్రమంలో కాంగ్రెస్ తాలూకా నాయకులు స్థానిక సూర్య ఫంక్షన్ హాలు ఎదురుగా బృహత్ వేదిక నిర్మాణానికి ఏర్పాట్లు చేస్తున్నారు. యువ కాంగ్రెస్ నేత రవి బోసురాజు పనులను పర్యవేక్షిస్తున్నారు. ఎవరికీ ఇబ్బందులు లేకుండా వేదిక నిర్మాణ పనులు చేస్తున్నారు. యంత్రాల సాయంతో స్థలాన్ని చదును చేస్తున్నారు. సోమవారం సాయంత్రం ఎమ్మెల్యే హంపయ్యనాయక్‌తో కలిసి రవి విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి వెనుక మేమంతా ఉన్నామని గట్టిగా దేశానికి చాటిచెప్పడమే ఈ కార్యక్రమ ఉద్దేశమన్నారు. రాయచూరు నుంచి సింధనూరు వరకు రూ.1600 కోట్లతో నాలుగు వరుసల రోడ్డు, చికల్‌పర్వి, చిక్కమంచాలి వద్ద వంతెన, బ్యారేజీల నిర్మాణం తదితర పనులకు సీఎం శంకుస్థాపనలు చేస్తారన్నారు. పంచ గ్యారంటీలు అమలుచేసి చూపిన ఘనత సీఎంకే దక్కుతుందన్నారు. ఆయన్ని ఎలాగైనా ఇబ్బంది పెట్టాలని కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తోందని ఆరోపించారు. కార్యక్రమానికి మంత్రులు సతీష్ జార్కిహొళి, ఎన్.ఎస్.బోసురాజు, హెచ్.సి.మహదేవప్ప, మునియప్ప, రహీంఖాన్, శరణప్రకాష్‌పాటిల్, శివరాజ్‌తంగడిగి తదితరులు హాజరవుతారని చెప్పారు.